నీటి వరుస!



నీటి కోసం క్యూలో ఉన్న ట్రాక్టర్లు

ట్యాంకరెనక ట్యాంకర్. వరుస కట్టాయి. ఇదేదో రోడ్డు పనులకో, ఫంక్షన్‌కో నీటిని తరలించడానికనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఈ ట్యాంకర్లు క్యూలో ఎండిపోతున్న పంటలకు నీటిని తీసుకెళ్లడానికి. జిల్లాలో పంటల దుస్థితికి ఈ ఫొటోయే నిదర్శనం. తాడిమర్రి మండలంలో చీనీ అధికంగా సాగులో ఉంది. గత ఖరీఫ్‌లో సరైన వర్షాలు కురవకపోవడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. భూగర్భ జలమట్టం పడిపోయింది. దీనికితోడు ప్రస్తుతం తీవ్రమైన ఎండలకు బోరుబావులు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పంటలను కాపాడుకోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. చెరువులు, కుంటల్లో కూడా ఎక్కడా నీరు లేదు. ఈ నేపథ్యంలో మండలంలోని కునుకుంట్ల గ్రామానికి చెందిన రైతులు పంటలను కాపాడుకోవడంలో భాగంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకునేందుకు సమీప గ్రామాలకు వెళ్తున్నారు. తాడిమర్రికి చెందిన రైతు నాగభూషణ బోరుబావి నుంచి మిగులు నీటిని తీసుకెళ్లేందుకు ట్యాంకర్లను ఇలా క్యూలో పెట్టుకున్నారు. 10 కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తరలించి చెట్లను కాపాడుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. -తాడిమర్రి

పింఛన్ సొమ్ము.. అప్పునకు జమ..



సుబ్బరాయుడు

రొద్దం, మే 6: వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధిపొందే కుట్రలో పండుటాకులు బలౌతున్నారు. పింఛన్ సొమ్ము నేరుగా అందజేయకుండా బ్యాంకు ఖాతాకు జమ చేయడంతో చాలామంది పింఛన్‌దారులు తీసుకోలేకపోయారు. పలు బ్యాంకులకు అప్పటికే ఉన్న రుణ కంతులకు పట్టేసుకోవడంతో పండుటాకులకు నిరాశే మిగిలింది. రొద్దం మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన వృద్ధుడు సుబ్బరాయుడు పింఛన్ సొమ్మును ప్రతినెలా మందులకు వాడుకునేవారు. ఈనెల బ్యాంకు ఖాతాకు పింఛన్ సొమ్ము జమ చేశారు. బ్యాంకు వారు వ్యవసాయ రుణానికి జమ చేసుకోవడంతో సుబ్బరాయుడుకు సొమ్ము అందలేదు. దీంతో ఈనెల మందులకు ఎలా చేయాలోనని వృద్ధుడు వాపోయాడు.

పూరి గుడిసెలో ఉంటున్నాం.. ఇంటి పట్టాకు అనర్హులమా?



మాట్లాడుతున్న సోమందేపల్లి వాసులు

పుట్టపర్తి, మే 6: పూరి గుడిసెలో ఉంటున్న తమకు ప్రభుత్వం ఇంటి పట్టా ఇవ్వలేదంటూ సోమందేపల్లికి చెందిన పేదలు జెండా ఓబులేసు, భారతి, అంజినమ్మ, నూర్జహాన్, మరికొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వారు సోమవారం స్పందనలో అర్జీ ఇచ్చుకునేందుకు స్థానిక కలెక్టరేట్‌కు వచ్చారు. ఎన్నికల నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేయడంతో కలెక్టర్‌ను కలవకుండా వెనుదిరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబరు 700లోని ప్రభుత్వ భూమిలో 150 పేద కుటుంబాల గుడిసెలు వేసుకుని, నివాసమంటున్నామని తెలిపారు. ఆ స్థలానికి ఇంటిపట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు విన్నవించామన్నారు. అయినా తమకు న్యాయం చేయలేదని వాపోయరు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలిచ్చామని ప్రతి సభలో సీఎం జగన్ ఊదరగొడుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందనడానికి సోమందేపల్లి వాసుల పరిస్థితే నిదర్శనం.

జగనన్నా.. రుణమాఫీ ఏదన్నా..?

మాట్లాడుతున్న కేశాపురం మహిళలు



పుట్టపర్తి, మే 6: మహిళా స్వయం సంఘాలకు ప్రభుత్వం ప్రకటించిన నాలుగోవిడత రుణమాఫీ సొమ్ము ఇంతవరకు అందలేదంటూ కొత్తచెరువు మండలం కేశాపురానికి చెందిన డ్వాక్రా సభ్యులు వాపోయారు. తమ సమస్యపై అర్జీ ఇచ్చుకునేందుకు సోమవారం వారు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో స్పందన కార్యక్రమం లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా మహిళాసంఘాల ప్రతినిధులు అనురాధ, నాగమణి, లక్ష్మి, గౌసియాబేగం, ఫాతిమా, సావిత్రి, శైలజ మాట్లాడుతూ.. తమ గ్రామంలో 41 సంఘాలుండగా.. తొమ్మిదింటి ఖాతాలకు డబ్బు జమకాలేదని వాపోయారు. దీనిపై అధికారులను అడిగినా సమాధానం లేదన్నారు. 9 సంఘాలకు సంబంధించి రూ.8లక్షలు మాఫీ సొమ్ము రావాల్సి ఉందని వాపోయారు. జిల్లా కలెక్టర్‌కు సమస్య చెప్పుకోవడానికి కలెక్టరేట్‌కు వచ్చామన్నారు.

ధర్మవరం రూపురేఖలు మారుస్తా

- చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొస్తా
- హంద్రీనీవా ద్వారా చెరువులను నింపి సాగునీరు అందిస్తా
- వైసీపీ పాలనపై జనం విసిగిపోయారు..
- మార్పు కోరుకుంటున్నారు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్



ధర్మవరం, మే 6: వైసీపీ పాలనతో నియోజకవర్గ ప్రజలు విసిగిపోయారనీ, మార్పు కోరుకుంటున్నారని కూటమి బీజేపీ ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎన్డీఏ కూటమి పాలన రావాలని కోరుకుంటున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని తేలిపోయిందన్నారు. 25 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాననీ, ప్రజలు తమవైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. తన గెలుపునకు ఢోకా లేదనీ, మెజారిటీపైనే చర్చ సాగుతోందన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే ధర్మవరం నియోజకవర్గ రూపురేఖలు మార్చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానంటున్న సత్యకుమార్ యాదవ్ 'ఆంధ్రజ్యోతి'తో సోమవారం ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ వివరాలిలా..

ఆంధ్రజ్యోతి: వైసీపీ ఐదేళ్ల పాలనలో చేనేత రంగం పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఆ రంగాన్ని రక్షించుకునేందుకు మీరు అధికారంలోకి వచ్చాక ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

సత్యకుమార్‌యాదవ్: ఒకప్పుడు ధర్మవరంలో 60వేల చేతిమగ్గాలుండగా.. నేడు వాటి సంఖ్య 15 వేలకు పడిపోయిందంటే చేనేతలపై వైసీపీ ప్రభుత్వం ఎంతటి నిర్లక్ష్యం చూపిందో అర్థం చేసుకోవచ్చు. వైఎస్ జగన్ ధర్మవరం వచ్చినపుడు అనేక హామీలిస్తూ అంతర్జాయతీ మార్కెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి కూడా రేగాటిపల్లి వద్ద చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తానన్నారు. అవేవీ అమలుకు నోచుకోలేదు. చేనేతలకు సబ్సిడీ పరికరాలు, రుణాలు ఇవ్వలేదు. మగ్గం గిట్టుబాటు కాక, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహ కరువై 55 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రూ24వేలు అర్హులందరికీ ఇవ్వడంతోపాటు కేంద్రం నుంచి వచ్చే పథకాలన్నీ అందేలా చూస్తాం. మెగా క్లస్టర్ ఏర్పాటు చేసి, మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి: ధర్మవరం నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మీరు అధికారంలోకి వచ్చాక వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

సత్యకుమార్‌యాదవ్: నియోజకవర్గంలో ఏ గ్రామానికెళ్లినా తాగు, సాగునీటి గురించి అడుగుతున్నారు. సత్యసాయి నీరు కూడా చాలాచోట్ల ఆగిపోయింది. పార్నపల్లి వద్ద నాలుగు మోటార్లున్నాయి. ఇందులో రెండు మరమ్మతుల బారినపడి చాలా రోజులైంది. వాటికి కనీసం మరమ్మతులు చేయించలేని దుస్థితిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి ఉన్నారన్నారు. చాలా గ్రామాల్లో వాటర్‌ప్లాంట్లను కూడా మూయించారు. తాము అధికారంలోకి వచ్చాక సత్యసాయి నీటి పథకాన్నికేంద్రం అమలుచేస్తున్న జల్‌జీవన్ పథకంతో అనుసంధానించి, ప్రతి ఇంటికీ నీటిని అందించేలా కృషిచేస్తా. హంద్రీనీవా కాలువను విస్తరించి, చెరువులన్నింటినీ నింపుతాం.

ఆంధ్రజ్యోతి: రైతాంగం అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

సత్యకుమార్‌యాదవ్: గతంలో బిందు, సూక్ష్మ సేద్యం పరికరాలను 90శాతం సబ్సిడీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించేవి. వైసీపీ వాటిని అటకెక్కించింది. కేంద్రం సాయంతో గ్రామాల్లో జలకళ పేరుతో బోర్లు వేస్తున్నాం. రాష్ట్రంలో జలకళ బోర్లు వేయకపోగా.. ప్రత్యర్థుల బోర్లను సిమెంట్ వేసి మూసివేశారు. కేంద్రం పథకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆపేసింది.

ఆంధ్రజ్యోతి: ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎక్కడ చూసినా భూములను కబ్జా చేశారన్న ఆరోపణలున్నాయి. మీరు అధికారంలోకి వచ్చాక ఆ భూములపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

సత్యకుమార్‌యాదవ్: నియోజకవర్గంలో వందల సంఖ్యలో ప్రభుత్వ, అసైన్డ్, డీకేటీ భూములను కబ్జా చేసినట్లు మా దృష్టికి వచ్చింది. తుంపర్తి, మోటుమర్ల గ్రామాల రైతులకు చెందిన పట్టా భూములను దౌర్జన్యంగా లాక్కొన్నారు. 20 ఎకరాలు ఎస్సీలకు చెందిన భూములను పట్టా చేస్తున్నారు. అసైన్డ్ భూములను ఎలా చేసుకున్నారో, వాటిపై అధికారంలోకి వచ్చాక విచారించి, నిజానిజాలు నిగ్గుతేల్చుతా.

ఆంధ్రజ్యోతి: ఎమ్మెల్యే అయితే నియోజకవర్గానికి ఏం చేస్తారు?

సత్యకుమార్‌యాదవ్: ధర్మవరం చేనేత పరిశ్రమ ప్రపంచ గుర్తింపు పొందింది. నేను ఎమ్మెల్యే అయిన వెంటనే చేనేత క్లస్టర్, ప్రాసెసింగ్ యూనిట్లను తీసుకువచ్చి, చేనేతలకు ఉపాధి కల్పిస్తా. కూటమి మేనిఫెస్టో పథకాలన్నీ అమలుచేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

సత్యకుమార్‌యాదవ్: నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా స్పందన బాగుంది. గ్రామాల్లో నానుంచి ఒక్క పైసా కూడా ఆశించకుండా వారే చందాలు వేసుకుని, భోజనాలు పెట్టించేపరిస్థితి. అంతేకాకుండా ప్రతి గ్రామంలోటీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు నా గెలుపు కోసం కష్టపడుతున్నారు. ఇప్పటికే ప్రజలు మార్పుకోరుకుంటున్నారు. 13వతేదీ కోసం ఎదురుచూస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారు.

ఉద్యోగుల ఓటుపై



ఆగని కుట్రలు..!



మడకశిర తహసీల్దార్ కార్యాలయం వద్ద పోస్టల్ బ్యాలెట్ కోసం క్యూలో నిల్చున్న ఉద్యోగులు

- వేసిన ఓట్లు చెల్లకుండా కుతంత్రాలు
- బ్యాలెట్ పేపర్‌పై సీలు వేయని వైనం
- ఉద్యోగుల నిరసన
- బ్యాలెట్ బాక్సులపై లక్క సీలు వేయకపోవడంపై అనుమానాలు

హిందూపురం అర్బన్, మే 6:
ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత నుంచి బయటపడేందుకు వైసీపీ ప్రభుత్వం కుతంత్రాలు పన్నుతోంది. ఉద్యోగులు వైసీపీకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటేయరని గ్రహించి, అడుగడుగునా కుట్రలు చేస్తోంది. వారు ఓటు వినియోగించుకోకుండా పన్నాగాలు పన్నుతోంది. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ కేటాయింపులో ఎన్నడూలేనన్ని ఎత్తులు వేస్తోంది. ప్రతిసారీలాగా వారు ఆర్వో పరిధిలో దరఖాస్తు చేసుకుంటే సొంతూరిలో ఓటు కల్పించి, షాకిచ్చారు. దీనిపై ఎన్నికల సిబ్బంది నిరసనలకు దిగడంతో వారికి మరికొన్ని రోజులు అవకాశం కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారిని ఓటేయకుండా ఆపలేకపోయారు. వారు వేసిన ఓటు చెల్లకుండా చేసేందుకు కొత్త కుట్ర పన్నారు. పలు చోట్ల పోస్టల్ బ్యాలెట్ పేపర్‌పై సీలు లేకుండా పంపిణీ చేస్తున్నారని ఎన్నికల సిబ్బంది మండిపడుతున్నారు. దీనిని గుర్తించి వారు.. పోలింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. సీలు వేసేదాకా ఓటు వేయమని తెగేసి చెబుతున్నారు. దీంతో సీలు వేయక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడ కూడా మరో కొత్త పన్నాగం పన్నినట్లు ఉద్యోగ వర్గాలు వాపోతున్నాయి. బ్యాలెట్ పేపర్లు వేసే బాక్సుకు లక్క సీలు వేయకపోవడంపై వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో బాక్సులో వేసిన బ్యాలెట్ పేపర్లను తొలగించే, చెల్లకుండా చేసే ప్రమాదం ఉందని వారు మండిపడుతున్నారు. దీంతో బాక్సులకు లక్క సీలు వేసేవరకు ఓటేసేది లేదని వారు పట్టుబడుతున్నారు. దీంతో అధికారులు లక్క సీలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలా.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాడి మరీ.. ఓటు హక్కును పొందాల్సి వస్తోందని ఆ వర్గాలు వాపోతున్నాయి.


గందరగోళం

మడకశిరటౌన్: ఇతర జిల్లాల నుంచి నియోజకవర్గానికి ఎన్నికల విధులకు వచ్చిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌పై గందరగోళం నెలకొంది. ఎన్నికల విధులకు నియమితులైన పీఈఓలు, ఏపీఓలు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు మడకశిర తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. శనివారమే శిక్షణకు హాజరైన ఉద్యోగులకు సోమవారం రావాలని ఎన్నికల అధికారులు సూచించారు. ఆ మేరకే ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు వచ్చారు. ఇతర జిల్లా, నియోజకవర్గాలకు చెందిన దాదాపు 256 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోగా.. అందులో 113 మందికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్‌ను అందించినట్లు అధికారులు తెలిపారు. మదనపల్లి, రాయచోటి, పులివెందుల, రాప్తాడు తదితర చోట్ల నుంచి వచ్చి మడకశిర నియోజకవర్గంలో ఎన్నికల విధులకు హాజరయ్యే వారి పోస్టల్ బ్యాలెట్‌పై గందరగోళం నెలకొంది. ఆర్‌ఓ, కలెక్టర్‌కు జాబితా పంపారనీ, ఆయా నియోజకవర్గాల నుంచి తమకు పోస్టల్ బ్యాలెట్ అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులు చెప్పడంతోనే పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వచ్చామన్నారు. ఈ విషయమై తహసీల్దార్ వెంకటేష్‌ను అడగ్గా.. ఆయా నియోజకవర్గాల నుంచి తమకు పోస్టల్ బ్యాలెట్ అందలేదనీ, రాగానే వారికి సమాచారం అందించి ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎలాగైనా ఓటు వేయకుండా చేయాలని..

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోపే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేస్తామని గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాల్లో ప్రస్తుత సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో వైసీపీ గెలుపొంది, జగన్ సీఎం అయ్యారు. సీపీఎస్ రద్దు హామీని మాత్రం విస్మరించారు. ఇచ్చిన హామీ నెరవేర్చాలని అడిగిన ఉద్యోగులపై వేధింపులకు దిగారు. నిరసనలు చేపడితే కేసులు పెట్టారు. జైలులో పెట్టారు. అడుగడుగునా ఉక్కుపాదం మోపారు. అయినా ఉద్యోగులు అలుపెరగని పోరాటం చేశారు. ఐదేళ్లలో హామీ నెరవేర్చకపోగా.. వేధింపులకు దిగడాన్ని ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపుతామని బహిరంగంగానే ప్రకటించారు. ఇది అధికార పార్టీలో కలవరం రేపుతోంది. దీంతో వారు ఓటు వేయకుండా, వేసినా చెల్లకుండా చేసేదిశగా కుట్రలు పన్నిందన్నది బహిరంగ రహస్యమే.

సీలు వేయకుండా..



సాధారణంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇన్‌వాలీడ్ కావు. ఎందుకంటే ఓటు ఎలా వేయాలో ప్రజలకు అవగాహన కల్పించేది వారే. వారిని కూడా తప్పుదోవ పట్టించే విధంగా రెవెన్యూశాఖ వ్యవహరించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సిబ్బంది ఓట్లు చెల్లకుండా చేసే దిశగా ప్రభుత్వం పన్నిన కుట్రలో రెవెన్యూ అధికారులు భాగస్వాములయ్యారన్న విమర్శలు బాధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ పేపర్‌పై కచ్చితంగా సంబంధిత రిటర్నింగ్ అధికారి సంతకం, సీలు ఉండాలి. కొన్నిచోట్ల పోస్టల్ బ్యాలెట్‌లో సంతకం మాత్రమే ఉందనీ, సీలు వేయకుండా అధికారులు బ్యాలెట్ పేపర్లు ఇస్తున్నట్లు సమాచారం. ధర్మవరంలో ఏర్పాటు చేసిన ఫెషిలిటేషన్ సెంటర్‌లో ఈనెల ఎన్నికల సిబ్బందికి ఇచ్చిన బ్యాలెట్ పేపర్లలో ఆర్వో సంతకం లేదని తెలిసింది. దీనిని గమనించిన ఎన్నికల సిబ్బంది సీలు వేసేదాకా పోస్టల్ బ్యాలెట్ పేపర్లు బాక్సుల్లోకి వేయమని భీష్మించినట్లు తెలుస్తోంది. దీంతో తర్వాత సీలు వేసి ఇచ్చినట్లు సమాచారం. పోస్టల్ బ్యాలెట్ పేపర్లు కవరులో ఉంచి, దానిని ఓ బాక్సులోకి వేయాల్సి ఉంది. ధర్మవరంలో బ్యాలెట్ బాక్సుకు లక్కసీలు వేయకుండా అందులో వేయమనడంతో ఎన్నికల సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో లక్కసీలు వేసేవరకు ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ కవర్లు బాక్సుల్లోకి వేయకుండా ఉండిపోయినట్లు తెలుస్తోంది. గంటన్నర తరువాత లక్క తెప్పించి, సీలు వేసినట్లు సమాచారం. ఆ తర్వాతే ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ పేపర్లను అందులోకి వేసినట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఓటు హక్కు ఎలా ఉపయోగించుకోవాలి, వీవీ ప్యాట్‌లను ఎలా భద్రపరిచాలి తదితర విషయాలు తెలియజేసే అధికారులే.. ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ పంపిణీలో పలు విషయాలు విస్మరించడం విస్మయానికి లోనుచేస్తోందని ఎన్నికల సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రభుత్వం దొంగ చర్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూపన్ ఇచ్చుకో.. డబ్బు పుచ్చుకో..

ఓటరు స్లిప్పు జతలో కూపన్ పంపిణీ

పెనుకొండలో వైసీపీ తాయిలాలు



పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ ఫొటోతో ముద్రించిన కూపన్, ఓటరు స్లిప్పు

హిందూపురం, మే 6:
పెనుకొండ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు.. ఓటర్లకు గేలం వేసేందుకు తాయిలాలు ఇవ్వడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో రెండు రోజులుగా ఓటరు స్లిప్పుతోపాటు వైసీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్ చిత్రంతో ఉన్న బ్యాలెట్ పత్రం అతికించి, పంపిణీ చేశారు. వీటిని వైసీపీ నాయకులు.. ఓటర్ల ఇళ్ల వద్దకెళ్లి అందజేశారు. రెండు రోజుల తరువాత నాయకులు ఇంటి వద్దకు వస్తారనీ, డబ్బు ఇస్తారనీ, కూపను వారికివ్వాలని నాయకులు చెప్పినట్లు సమాచారం. పెనుకొండ మండలానికి చెందిన కొంతమంది ఓటర్లకు అందజేసిన ఓటరు స్లిప్పులు, కూపన్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ మూకల దాడి



గాయపడిన టీడీపీ కార్యకర్త మధుసూదన్

కొత్తచెరువు, మే 6: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మధుసూదన్‌పై వైసీపీ మూకలు ఆదివారం రాత్రి దాడి చేశాయి. బాధితుడు మధుసూదన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధుసూదన్ విరుపాపురం సమీపంలోని పొలం వద్ద గొర్రెలకు మేత వేసి, తిరిగి నారాయణపురానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా వైసీపీ కార్యకర్తలు ప్రసాద్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్బరాయుడు బైక్‌లో ఎదురుపడ్డారు. మార్గమధ్యలో మలుపు వద్ద ఢీకొన్నారు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి మధుసూదన్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. దీంతో మధుసూదన్ తలకు తీవ్ర గాయమైంది. స్థానిక పోలీసు స్టేషన్‌లో మధుసూదన్ ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారమేశ్ తెలిపారు.

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 28.0	41.0 28.0	42.0 28.0	40.0 26.0	40.0 27.0

ఘనంగా ఈశ్వరమ్మ డే





ఈశ్వరమ్మ సమాధి వద్ద పూజలు నిర్వహిస్తున్న ఆర్‌జే రత్నాకర్ దంపతులు.. సంగీత కచేరి నిర్వహిస్తున్న మాలిక సుందర్ బృందం

పుట్టపర్తి : సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్.. కుటుంబసభ్యులతో కలిసి ఈశ్వరమ్మ సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు భక్తిగీతాలు ఆలపించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు నారాయణసేవ చేశారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో ప్రముఖ సంగీత గాయకులు మాలిక్‌సుందర్ బృందం కచేరి నిర్వహించింది. గంటపాటు భక్తులను అలరింపజేశారు. ఈశ్వరమ్మ డేను పురస్కరించుకుని సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఉద్యోగావకాశాలు కల్పించే వారికే ఓటు



తొలిసారి ఓటు వేస్తున్నా.. గత ఐదేళ్లలో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం బెంగుళూరు, హైదరబాదు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పితే బాగుంటుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. కియా పరిశ్రమ లాంటివి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం తీవ్ర నిరాశకు గురయ్యాం. ఉద్యోగాల భర్తీకి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి యువకుడు ఇదేవిధంగా ఆలోచిస్తున్నారు. అలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలనుకుంటున్నారు.

- సూర్యప్రతాప్‌గౌడ్, సిండికేట్ నగర్
అనంతపురం రూరల్

చెరువులకు నీళ్లిస్తామని మాట తప్పారు..

అధికారంలోకి వస్తే కృష్ణా జలాలను హంద్రీనీవా కాలువల ద్వారా తీసుకు వచ్చి చెరువులను నింపి సాగు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పిన వైసీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక హామీని గాలికి వదిలేశారు. ఒక్కచెరువుకు నీరు నింపలేదు. దీంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోర్లలో నీళ్లు లేక పండ్లతోటలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు బోర్లకు మీటర్లు బిగించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయారు. హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు నీరు వదిలి తాగు, సాగు నీటి సమస్య పరిష్కరించాలి.



- యంజారప్ప, రైతు, మల్లినమడుగు,
రొళ్ల మండలం(మడకశిర)

బాబుకు దివ్యాంగులు రుణపడి ఉంటారు



చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు ఇస్తారు. ఆ పార్టీ మేనిఫెస్టోలో దివ్యాంగులకు హామీ ఇచ్చారు. దివ్యాంగులు అందరూ బాబుకు రుణపడి ఉంటారు. నేను బీఏ వరకు చదువుకున్నాను, దివ్యాంగుడిని. జగన్ దివ్యాంగులకు సంక్షేమంలో ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ఇప్పుడు పింఛన్ రూ.3వేలు ఇస్తున్నారు. చంద్రన్న నెలకు రూ.6వేలు పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చారు. తప్పకుండా హామీ నెరవేరుస్తారని ఆశతో ఉన్నాం.

- ఆదినారాయణ, దివ్యాంగుడు, శింగనమల

జగన్‌ను కాదు.. మమ్మల్ని చూడండి

ప్లీజ్.. ప్లీజ్.. డబ్బులిస్తాం ఓటెయ్యండి

వైసీపీ శ్రేణులు, అనుకూల ఉపాధ్యాయ నేతల వేడుకోలు

అనంతపురం టౌన్, మే 6: 'చూడండి సార్, మేడమ్.. మీరు జగన్‌ను చూడొద్దు .. ఇక్కడ లోకల్‌గా అనంత వెంకటరామిరెడ్డిని, మమ్ములను చూడండి.. ప్లీజ్.. ప్లీజ్.. కావాలంటే డబ్బులిస్తాం, మాకు ఓటెయండి' అంటూ అధికార వైసీపీ శ్రేణులు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోస్టల్ ఓట్ల కోసం జిల్లా కేంద్రంలో బేరమాడడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌తోపాటు ప్రజాప్రతినిధులు, ఐఏఎస్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, పీఆర్‌సీ, హెచ్ఆర్ఏలు కట్‌చేసి జీతాలు తగ్గించడం, అడిగినోళ్లపై కక్షసాధింపులకు దిగడం వంటివి చేస్తూ వచ్చారు. ఇలా అనే రకాలుగా వేధింపులకు గురైన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈసారి సీఎం జగన్ పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో సీఎంకు వ్యతిరేకంగా 80శాతానికి పైగానే ఓట్లు వేస్తున్నారని ఆయా వర్గాలు చెబుతున్నాయి. దీంతో అనంతపురం జిల్లా కేంద్రంలో వైసీపీ నేతలు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు వినూత్న ప్రచారం ఎత్తుకున్నారు. ఎలాగైనా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తమవైపు తిప్పుకోవాలని, ఓటు వేయడానికి వస్తున్న వారికి రెండు వేలిస్తాం, మూడు వేలిస్తాం అంటూ వేడుకుంటూ ప్రలోభాలకు గురిచేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 'వీరికెంత సిగ్గులేదప్పా.. ఇంత అన్యాయం చేసి మళ్లీ ఇంత బరితెగించి ఓట్లు అడుగుతున్నారు' అని పెదవి విరుస్తున్నారు. సీఎం జగన్ పేరు చెప్పి ఓటు అడిగితే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓట్లు వేయరని వైసీపీ నాయకులే అంటున్నారంటే.. ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు.





అర్ధంతరంగా ఆగిన కాలువ పనులు



నీరులేక వెలవెలబోతున్న గుండ్లపల్లి చెరువు

ఇవి రోడ్లేనా..?

మోకాలి లోతు గుంతల్లో ప్రయాణం

వాహనదారులకు నరకప్రాయం

మరమ్మతులకు నోచుకోని రహదారులు

ప్రతి పల్లెకు రోడ్లు వేశామంటూ వైసీపీ ప్రచారాలు



మూడేళ్లుగా కంకర వేసి వదిలేసిన పాల్తూరు-కరకముక్కల రోడ్డు

విడపనకల్లు: ఉరవకొండ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతున్నా కొత్తరోడ్లు వేయకపోగా.. ఉన్న రోడ్లను కూడా తవ్వి వదిలేశారు. వైసీపీ పాలకుల పుణ్యమా అంటూ కంకర్లు తేలిన రోడ్లతో ఆయా గ్రామాల ప్రజలు నరక ప్రయాణం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం కరకముక్కల-పాల్తూరు రోడ్డు వేయిస్తామంటూ దాదాపుగా మూడు కిలోమీటర్లు మేర బాగున్న రోడ్డును తవ్వించి కంకర వేసి వదిలేశారు. ఈ కంకర దారిలో ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు ప్రతి రోజూ ఏదో ఒకచోట ప్రమాదానికి గురవుతున్నారు. దీంతో పాల్తూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులే రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. తారు రోడ్డు వేయటానికి చేత కాకాపోతే కనీసం మట్టి రోడ్డు అయినా వేయండి అంటూ వైసీపీ ప్రముఖ నాయకులు డిమాండ్ చేశారు. కానీ, అధికారుల్లో కానీ, ఆ పార్టీ నాయకుల్లో ఏమాత్రం చలనం రాలేదు. నాలుగేళ్లుగా కంకర వేసిన రోడ్డును పట్టించుకునే నాథుడేలేడని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా ఆర్.కొట్టాల-జొనేకల్లు రోడ్డును రెండేళ్ల క్రితం ఎక్స్‌కవేటర్లతో తవ్వించి చిన్న కంకర వేసి వదిలేశారు. నిధులు లేవంటూ పనులు నిలిపివేయటంతో ఆ రోడ్డున వెళ్లే రైతులు, గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకూ ఫిర్యాదులు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. గాజుల మల్లాపురం వెళ్లే మట్టి రోడ్డుపై వర్షాల కాలంలో మోకాలి లోతు గుంతలు పడి కనీసం మనుషులు కూడా నడిచి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వి.కొత్తకోట-విడపనకల్లు రోడ్డును గత టీడీపీ ప్రభుత్వంలో మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం ఈ రోడ్డు మొత్తం వర్షాల కారణంగా కంకర్లు తేలి అధ్వానంగా మారిపోయింది. రోడ్డు పనులు చేయించాలని జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా దిక్కులేదు. విడపనకల్లు మండలం జనార్దనపల్లి నుంచి వజ్రకరూరు మండలం చాబాల వరకూ రోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. ఈ మూడు కిలో మీటర్లు ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. కంకర్లు తొలగించి కనీసం మట్టి వేసినా బాగుండేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బూదగవి-చీకలగురికి రోడ్డు మరీ దారణంగా మారిపోయింది. రెండు చోట్ల బ్రిడ్జిలు పూర్తిగా శిథిలమయ్యాయి. రోడ్డు మొత్తం కంకర తేలింది. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు నుంచి పందికుంట వరకూ రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. నియోజకవర్గంలోని మరుట్ల రోడ్లు మరీ దారుణంగా మారిపోయాయి. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లని పరిస్థితిలో దారులు ఉన్నాయి. ఇంత దారుణంగా ఉన్నా వైసీపీ నాయకులకు ఏ మాత్రం కనిపించటంలేదు. ప్రతి గ్రామంలోను రోడ్లు వేశామంటూ ప్రచారం చేస్తుండడంపై గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఒక్క రోడ్డు కూడా వేసిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కంకర వేసి.. వదిలేశారు



నాలుగేళ్ల క్రితం కరకముక్కల-పాల్తూరు రహదారిలో తారు వేయాలని ఎక్స్‌కవేటర్లతో తవ్వించి 40 ఎంఎం కంకర వేశారు. నిధులు లేకపోవటంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేయకుండా వదిలేశాడు. కంకర తొలగించి కనీసం మట్టి రోడ్డు అయినా వేయండి అంటూ వైసీపీ నాయకులే రోడ్డుపై నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించలేదు. కంకర రోడ్డుపై పడిన చాలా పశువులు మృతి చెందాయి. అనేక మంది ద్విచక్ర వాహనదారులు కిందపడి ఆసుపత్రుల పాలయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అని చెప్పుకునే విశ్వేశ్వరరెడ్డికి పాల్తూరు రోడ్డు కనిపంచక పోవటం ఏమిటి. పల్లెల్లో అభివృద్ధి చేశామంటూ ఉత్తుత్తి మాటలు చెప్పి ఓట్లు అడిగేందుకు వస్తున్నాడు.

- చౌడికి గంగన్న, పాల్తూరు

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది



ఆర్.కొట్టాల నుంచి జొనేకల్లుకు వెళ్లే దారిని రెండేళ్ల క్రితం ఎక్స్‌కవేటర్లతో తవ్వించి చిన్న కంకర వేసి వదిలేశారు. పంటల కాలంలో రోడ్డును తవ్వటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తారు రోడ్డు వేయండి, లేదా కంకర తొలగించి మట్టి రోడ్డు అయినా వేయండని తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినా స్పందించలేదు. ధర్నాలు చేసినా అధికారుల్లో కానీ, అధికార పార్టీ నాయకుల్లో కానీ చలనం రాలేదు. ఇప్పటికి ఈ రోడ్డుపై కంకర అలాగే ఉంది. రైతులకు, ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నిధుల లేవంటూ ఉన్న రోడ్డును తవ్వించి కంకర వేసి వదిలేశారు.

- పురుషోత్తంనాయుడు, ఆర్.కొట్టాల

ఐదేళ్లుగా గంప కంకర కూడా వేయలేదు



మా గ్రామానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు వేశారు. ఇంక ఇప్పటి వరకూ ఒక్క గంప కంకర కూడా వేయలేదు. వర్షాల ధాటికి తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఎక్కడిక్కడ గుంతలు పడిపోయి కంకర్లు తేలాయి. కనీసం మనుషులు కూడా రోడ్డుపై తిరగలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులకు గ్రీవెన్స్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు మా గ్రామంవైపు తిరిగి చూడలేదు. ఇప్పుడు రోడ్లు వేస్తాం.. ఓటు వేయండి అని అడిగేందుకు వస్తున్నారు.

- కె.రంగస్వామి,
వి.కొత్తకోట



కంకర తేలిన వి.కొత్తకోట-విడపనకల్లు రోడ్డు



మోకాలి లోతు గుంతలతో నిండిన గాజుల మల్లాపురం మట్టి రోడ్డు



కంకర తేలిన జనార్దనపల్లి-ధర్మపురి రోడ్డు



ఛిద్రమైన చాబాల-ధర్మపురి రోడ్డు

హామీ మరిచారు

నీరులేక బోసిపోతున్న చెరువులు

అడుగంటిన భూగర్భజలాలు

బీళ్లుగా మారుతున్న వ్యవసాయ తోటలు

గట్టెక్కేది ఎట్లా అంటూ రైతుల ఆందోళన

బెళుగుప్ప: మండలంలో ఎలాంటి సాగునీటి వనరులు లేవు. తీవ్ర వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం తగ్గి, వాటి కింద సాగు చేసే వ్యవసాయ తోటలు బీళ్లుగా మారుతున్నాయి. అందుబాటులో ఉన్న చెరువుకు నీరుచేరితే తాగు, సాగు నీటి సమస్య తీరుతుంది. మండలంలో పది చెరువులుండగా.. గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రైతుల ఇబ్బందుల ను దృష్టిలో ఉంచుకుని శీర్పి, బెళుగుప్ప చెరువులను జీడిపల్లి రిజర్వాయరు ద్వారా కృష్ణా జలాలతో నింపారు. మిగిలిన చెరువులకు నీరిచ్చేందుకు కాలువ పనులు కొనసాగుతుండగా ముందుగా పరిహారం చెల్లించి కాలువలు తవ్వాలని వైసీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో కాలువల పనులు నిలిచిపోవడంతో కృష్ణా జలాలతో చెరువులు నింపడం ముందుకు సాగలేదు. ఈ లోగా ఎన్నికలొచ్చాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాగానే అన్ని చెరువులు నింపి రైతన్నల సమస్యలు తీరుస్తామని అప్పట్లో ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. అలాగే తవ్విన కాలువల కోసం సేకరించిన భూములకు నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చింది. దాదాపు అయిదేళ్ల గడిచిపోయాయి. అయితే ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు ఇచ్చిన హామీ గురించి పట్టించుకోలేదు. కాలువలు పూర్తి కాలేదు. నీటితో చెరువులు నిండలేదు. చెరువులకు నీరొస్తే తమ కష్టాలు తీరుతాయని అనుకున్న మండలంలోని రైతులకు నిరాశే మిగిలింది. బోర్లన్నీ ఎండిపోయి వ్యవసాయ తోటలు బీళ్లుగా మారాయి. ప్రస్తుతం పరిస్థితుల్లో చెరువులను నీటితో నింపితే తప్ప తాము గట్టెక్కలేమని ఆవేదన చెందుతున్నా రు. ఈ ఐదేళ్ల కాలంలో రైతులకు ఇచ్చిన హామీ గురించి పట్టించుకోని వైసీపీ నాయకులు, మళ్లీ ప్రస్తుత ఎన్నికల సందర్భంగా పాత పాట మొదలెట్టారు. వైసీపీని గెలిపించండి అన్ని చెరువులు నింపుతామని ఊకదంపుడు మాటలు చెబుతున్నారు. ఈ ఐదేళ్లు ఏమి చేసినట్లు.... ఇక చాలు మీ బూటకపు హామీలని రైతులు అంటున్నారు.

చెరువుకు నీరొస్తేనే గట్టెక్కేది..



చెరువులో నీరు లేక బోర్లన్నీ ఎండిపోతున్నాయి. నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ తోటలో రెండు బోర్లలో గతంలో నీరొచ్చేది. ఇప్పుడు అవి రెండింటిలో నీరు రావడం లేదు. నీరు లేకపోవడంతో పంటలు సాగు చేయలేక పోతున్నా. పొలాన్ని బీడు పెట్టాల్సి వస్తోంది. చెరువుకు నీరు వదిలితేనే వ్యవసాయం చేసి, నా కష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చక పోవడంతో, మా సమస్యలు పరిష్కారం కాలేదు.

- సురేష్‌బాబు, రైతు, కోనాపురం

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

ఓటు ఉన్నచోటుకు డ్యూటీ ఆర్డర్‌తో వెళ్లాలి... కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మే 6: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 3 నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఓటింగ్ చేపట్టామని తెలిపారు. తొలి రెండు రోజులు కొంత గందరగోళం ఉన్నా ఇపుడు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ షెడ్యూల్ మేరకు సోమవారం ముగియాలన్నారు. చాలామంది ఓటు వినియోగించుకోకపోవడం, కొందరి పేర్లు జాబితాలో లేకపోవడంతో మరో రెండు రోజులు గడువు పొడగిస్తూ ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. ఎన్నికల విధులకు నియమించి, ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారికి మరో రెండురోజులు (మంగళ, బుధ) అవకాశం ఇస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ జాబితాలో పేర్లు లేనివారు ఆర్డర్‌తోపాటు ఓటరు ఐడీ, ఏదైనా గుర్తింపుకార్డు తీసుకొని ఓటు ఉన్నచోటుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సమస్య వస్తే జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే జిల్లాలో



మాట్లాడుతున్న కలెక్టర్

నిబంధనల మేరకే హోం ఓటింగ్

హోం ఓటింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. 85ఏళ్ల పైబడి నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు హోంఓటింగ్‌కు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందన్నారు. జిల్లాలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 618 మంది, దివ్యాంగులు 629 మంది మొత్తం 1247 మంది హోంఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికి ఈనెల 5నుంచి కమిషన్ నిబంధనల మేరకు 38 ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి హోం ఓటింగ్ చేపడుతున్నామన్నారు.

రూ.32.37 కోట్లు సీజ్... రూ.27 కోట్లు రిలీజ్...

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రూ. 32.37 కోట్లు సీజ్‌చేశామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఆధారాలు చూపించిన తర్వాత అందులో రూ. 27 కోట్లు రిలీజ్ చేశామని వివరించారు. విచారణ అనంతరం 30 కిలోల బంగారం, వెండిని కూడా రిలీజ్ చేశామన్నారు. ఇటీవల అనంతపురం నగరంలో రూ. 1.50 కోట్లు పట్టుబడిందని, ఆ డబ్బు కదిరికి చెందిన వ్యక్తిది అని చెప్పడంతో సత్యసాయి జిల్లాకు ఈ కేసును రెఫర్ చేశామని కలెక్టర్ వెల్లడించారు.

ఉపాధి కల్పనకు పెద్దపీట

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాం

టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి

ప్రచారంలో అడుగడుగునా బ్రహ్మరథం

పుట్టపర్తి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయమైందని, మరికొన్ని రోజుల్లో జగన్ రాక్షస పాలన అంతం కాబోతోందని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాప్తాడు, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పరిటాల సునీత, సవిత, పల్లె సింధూరరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, కేంద్రంలో మోదీ సంకల్పపత్ర్ జత చేసి సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడమే తమ కూటమి లక్ష్యమని చెప్పారు. ఆర్థికంగా, అభివృద్ధి పరంగా గాడితప్పిన రాష్ట్రాన్ని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పునఃనిర్మాణం చేపడతారని అన్నారు. హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ప్రతి చెరువుకు నీరుతెచ్చి ప్రతి ఎకరా సాగులోకి తీసుకువస్తామన్నారు. పార్లమెంట్ నియోజక పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకువచ్చి వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలబెడతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఆంక్షలు లేని సంక్షేమం, అభివృద్ధి నిలయంగా పార్లమెంట్ నియోజకవర్గాన్ని చేస్తానని అన్నారు. యువత వారి కాళ్లపై వారు నిలబడే విధంగా నియోజక వర్గాల వారిగా నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు చూపించి నిరుద్యోగిత తగ్గించడానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర రాష్ట్రాల సాయంతో యువతకు ఉపాధి, మహిళలకు సాధికారిత సాధించేలా కృషి చేస్తానని అన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను ప్రజలు బలపరిచి అఖండ మోజార్టీని ఇవ్వాలని విన్నవించారు. బీకే ప్రచారంలో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు.



పెనుకొండ నియోజకవర్గం మల్లాపల్లిలో బీకే ప్రచారం

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మందకృష్ణ మాదిగ

అనంతపురం అర్బన్, మే 6: టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనలో మాదిగలతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఏపీని రాజధానిలేని రాష్ట్రంగా జగన్ మార్చారని విమర్శించారు. ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

జగన్ మాటలను నమ్మొద్దు: అంబికా

జగన్ మాటలు నమ్మి మోసపోవద్దని టీడీపీ కూటమి అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ దళిత ఓటర్లను కోరారు. గత ఎన్నికల్లో ఓట్లు వేసిన పాపానికి దళితులపై దాడులకు తెగబడుతున్నారన్నారు. దళిత ద్రోహి జగన్‌ను ఇంటికి పంపాలని కోరారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే దళితులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

- జగన్ ప్రభుత్వంలో దళితులే ఎక్కువగా నష్టపోయారని ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ అన్నారు. ఐదేళ్లల్లో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలతో వైసీపీవారు పేట్రేగిపోయారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. మాదిగలు జగన్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే జిల్లాలవారీగా వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, ఎమ్మార్పీఎస్ నాయకులు మధు, కదిరప్ప, నాగార్జున, టీడీపీ నాయకులు సరిపూటి రమణ, రాయల్ మురళి, వెంకటేష్, శివకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మీది గూగుల్‌పేనా.. ఫోన్‌పేనా..?

రాను, పోను ఖర్చులు మావే..

వలస ఓటర్లపై పార్టీల దృష్టి



కదిరి అర్బన్, మే 6: ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. ఒక్క ఓటుతోనే ఓడిన, గెలిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అందుకే గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి ఉద్యోగ, ఉపాధి పొందుతున్న వలస ఓటర్లపై రాజకీయ పార్టీల కన్నుపడింది. వారిని స్వగ్రామాలకు రప్పించి తమకు అనుకూలంగా ఓటు వేయించుకునేందకు ఆయా పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. రాను పోను ఖర్చులు మావేనని, ఆపై రోజుంతా ఖర్చు తమదేనంటూ ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నారు. ఇక్కడి బంధువులు, కుటుంబ సభ్యుల ద్వారా వలస వెళ్లినవారి ఫోన్ నెంబర్లు సేకరించి మాట్లాడుతూ గ్రామాలకు వచ్చి తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆయా ఫోన్ నెంబర్లుకు ఫోన్‌పే, గూగూల్ పే ఉందా అని ఆరా తీసున్నారు. పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండడం, ప్రతి ఓటు ముఖ్యమైనది కావడంతో పనిలో పనిగా డబ్బులు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లిస్తూ ఓటర్లను ఆకట్టుకున్నట్లు చర్చలు జరుగుతున్నాయి.

గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలి



పూర్వపు నల్లమాడ, ప్రస్తుత పుట్టపర్తి నియోజకవర్గం నుంచి ఎంతోమంది ఎమ్మెల్యేలు, మంత్రులయ్యారు. కానీ ఉపాధి అవకాశాలు మాత్రం కల్పించలేకపోయారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి దొరుకుతుంది. ఇక్కడ పనులు లేకపోవడంతో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వసలువెళ్లి జీవనం సాగిస్తున్నారు. ప్రమాదాల్లో ఎంతోమంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఒక గార్మెంట్ పరిశ్రమను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం కూలీలు వలసలు పోకుండా స్థానికంగా పనులు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎన్నికల సమయంలో నాయకులు తాము గెలిస్తే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్నారే కానీ ఎవరూ నెరవేర్చలేదు. ఈసారి గెలిచే అభ్యర్థి అయినా పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసలు నివారించాలి.

- రహంతుల్లా, నల్లమాడ

అభివృద్ధికే తొలి ఓటు

ప్రభుత్వ నిర్మాణంలో ఓటు కీలకం. అత్యంత శక్తివంతం. ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించగల పార్టీకే తమ ఓటు అనీ, అభివృద్ధి చేసేవారికే తొలి ఓటు వేయనున్నట్లు కొత్తగా ఓటు హక్కు పొందిన యువత పేర్కొన్నారు.

- కదిరి అర్బన్

నిజాయితీగా ఉంటేనే అభివృద్ధి



మనం ఎన్నుకునే నాయకులు నిజాయితీగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. నాకు తొలిసారి ఓటు హక్కు రావడం గర్వంగా ఉంది. ప్రతి ఓటరు కూడా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధిపై నాయకులను నిర్భయంగా ప్రశ్నించవచ్చు. ఎన్నికల సమయంలో వచ్చి తరువాత కనిపించకుండాపోయే నాయకులను ఎన్నుకోవడం వృథా.

- గిరీష్, ఎగువపల్లి, కదిరి మండలం

ఆలోచించి ఓటు వేయాలి



ఓటు వేసేముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి వేయాలి. మన భవిష్యత్ ఎలా ఉండాలన్నది మనం వేసే ఓటుపైనే ఆధారపడి ఉంటుంది. పార్టీలకోసం డబ్బుకోసం కాకుండా నాయకుడి గుణగణాలను, నిజాయితీని పరిగణనలోకి తీసుకుని ఓటు వేస్తే బాగుటుందనేది నాఅభిప్రాయం. తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నదుకు ఆనందంగా ఉంది.

- దేవేంద్ర, ఎగువపల్లి, కదిరి మండలం

ఓటు.. వజ్రాయుధం



ప్రలోభాలు ఆశ చూసి, ఓటువేయించుకోవాలనే నాయకులను ఎట్టి పరిస్థితిలో నమ్మను. వారికి నా తొలి ఓటు వేయను. ఓటు హక్కు వజ్రాయుధంలాంటింది. నిజాయితీగా ఓటు వేస్తే, మనకు కావలసిన అభివృద్ధి పనుల గురించి ఎన్నికైన ఎమ్మెల్యేలను ధైర్యంగా అడిగే అవకాశముంటుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వేయడం కీలక పరిణామంగా భావిస్తున్నా.

- మహేష్, కె. కుంట్లపల్లి, కదిరి మండలం

ఉద్యోగాలు కల్పించే వారికే ఓటు



ఉద్యోగావకాశాలు కల్పించడానికి కృషి చేసేవారికే నా మొదటి ఓటు వేస్తా. చదువుకున్నయువతకు కావల్సింది ఉద్యోగమే. కావున అందుకు కృషి చేసేవారికే అవకాశం ఇవ్వాలి. మొదటిసారి ఓటు హక్కు రావడం ఆనందంగా ఉంది. పోలింగ్ తేదీ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నా.

- రాజేష్, కె. కుంట్లపల్లి, కదిరి మండలం

నిస్వార్థంగా సేవ చేసే వారికే..



భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, ప్రలోభాలకు లొంగకుండా రాజ్యాంగానికి కట్టుబడి రాష్ట్రాభివృద్ధికి పనిచేసే నాయకున్ని, ఎన్నుకునేందుకు నా ఓటు హక్కును వినియోగించుకుంటా. ప్రతి ఒక్కరు నిజాయితీ పరులకు ఓటు వేసి గెలిపించాలి.

- గణేష్, కాళసముద్రం, కదిరి మండలం

ప్రచారానికి ప్రార్థనా మందిరాలు ఉపయోగించకూడదు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 6: ఎన్నికల ప్రచారానికి ఎలాంటి ప్రార్థనామందిరాలను ఉపయోగించకూడదు. ప్రచారానికి వేదికలుగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఇతర ప్రార్థనా మందిరాలను వినియోగించకూడదు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆయా ప్రార్థనా మందిరాలకు సంబంధించిన శాఖల అధికారులు హెచ్చరికలతో కూడిన నోటీసులు ఇస్తారు. అదే విధంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభల నిర్వహణకు మైదానాల కేటాయింపు విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికార పార్టీతో పాటు ఇతర అన్ని పార్టీలకు సమానంగా మైదానాలను కేటాయించాల్సి ఉంటుంది. హెలిప్యాడ్‌ల వినియోగంలోనూ అన్ని పార్టీలకు ఈ నిబంధన వర్తిస్తుంది.

నీళ్లు ఇచ్చే నాయకుడేడీ..?



ఎండిపోయిన చీనీ చెట్టు

ఐదెకరాల్లో చీనీచెట్లు ఎండిపోయాయి



బోర్లలో నీరు రాకపోవడంతో నీటితడులు అందించలేక ఐదెకరాల్లో సాగుచేసిన చీనీపంట నిట్టనిలువునా ఎండిపోయింది. సుమారు ఏడేళ్ల వయస్సు ఉన్న చీనీచెట్లు పూర్తిగా ఎండిపోవడంతో తొలగించాల్సి వచ్చింది. మరికొన్ని చీనీచెట్లను పైపులైను ద్వారా నీటిని చిలమకూరు ఏటి నుంచి తరలిస్తూ బతికించుకుంటున్నాం. ఇప్పటికే పైపులైను మరమ్మతుల కోసం రూ.5లక్షల మేర ఖర్చుచేశాను. నాలాంటి రైతులు చాలామంది ప్రత్యామ్నాయంగా ఏటిప్రాంతం నుంచి పైపుల ద్వారా నీటి సరఫరా చేసుకుంటూ చెట్లను బతికించుకుంటున్నారు.

- రామానాయుడు, రైతు, కోమటికుంట్ల

శాశ్వత పరిష్కారం చూపే నాథుడే లేడు



పదేళ్ల కిందట కరువు విలయతాండవం చేస్తున్న సమయంలో చెట్లు ఎండిపోవడంతో పెంచిన చేతులతోనే నరికేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ ఏడాది కూడా తీవ్ర వర్షాభావంతో చెరువులో నీరు లేక భూగర్భజలాలు అడుగంటాయి. 1200నుంచి 1500అడుగుల మేర బోర్లు వేస్తున్నా నీటిజాడ కనిపించడం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే నాథుడే లేరు. ఐదేళ్ల కిందట ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పైపులైను ద్వారా గండికోట నుంచి నీరు తెస్తామని ఇచ్చిన హామీ నీటిమూటగా మారింది.

- భాస్కర్‌నాయుడు, రైతు, కోమటికుంట్ల

మూడు చెరువులకు హెచ్చెల్సీ నీరు హుళక్కే..

వర్షాలతో రెండేళ్లపాటు చెరువులు నిండిన వైనం

ఈ ఏడాది హెచ్చెల్సీ నీరు రాక ఎండిపోయిన చెరువులు

పంటలను కాపాడుకునేందుకు శ్రమిస్తున్న రైతులు

పుట్లూరు: హెచ్చెల్సీ నీటితో మండలంలోని మూడు చెరువులను నింపుతామన్న పాలకుల మాట నీటి మూటగా మరింది. మండలంలో పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల్లోని మూడు చెరువులు నిండితే ఇక్కడ కరువుకు చోటుండదు. ఈ ఏడాది హెచ్చెల్సీ నీరు రాకపోవడంతో మండలంలోని మూడు చెరువులు ఎండిపోయాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోయి పంటపొలాలు ఎండిపోతున్నాయి. ఈ ఐదేళ్లలో రెండేళ్ల పాటు వర్షాలు సమృద్ధిగా రావడంతో మూడుచెరువులు నిండాయి. మరో ఏడాది మాత్రం అడపాదడపా అరకొరగా హెచ్చెల్సీ నీరు రావడంతో కొద్దిమేర చెరువులు నిండాయి. కానీ ఈ ఏడాది పూర్తిగా రాకపోవడంతో తాగునీటి సమస్య కూడా తలెత్తుతోంది. 2019 ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే మూడుచెరువులు హెచ్చెల్సీ నీటితో నింపుతామంటూ వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత ఇటు వైపు కూడా కన్నెత్తి చూడలేదనే విమర్శలు ఉన్నాయి.


ఎండుతున్న ఉద్యాన పంటలు

నీరు రాకపోవడంతో చెరువుల కింద సాగుచేసిన ఉద్యాన పంటలు ఎండి పోతున్నాయి. చీనీ, అరటి, దానిమ్మ తదితర పంటలు ఎండిపోయి రైతులకు కన్నీటిని మిగులుస్తున్నాయి. బోర్లలో నీరు అడుగంటిపోవడంతో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేసిన రైతులు లబోదిబో మంటున్నారు. మండలంలో ఇప్పటికే వంద ఎకరాలకు పైగా చీనీ, 80ఎకరాలకు పైగా దానిమ్మ పంటలను బోర్లలో నీరు రాకపోవడంతో తొలగించారు. కాగా యల్లనూరు మండలం చిలమకూరు ఏటి నుంచి కోమటికుంట్ల గ్రామానికి కొందరు రైతులు 11 కిలోమీటర్ల మేర పైపలైన్ వేసి నీటిని తరలిస్తూ చీనీచెట్లను కాపాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే పాలకులు హామీలు ఇస్తారే తప్ప నెరవేర్చరనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



నీటికోసం పైప్‌లైను వేస్తున్న దృశ్యం

పవరు లేని పదవులు..!



వైసీపీ పాలనలో ఉత్సవ విగ్రహాలుగా ప్రజాప్రతినిధులు

మూడేళ్లు గడిచినా నిధుల్లేవు.. విధుల్లేవు..

చిలమత్తూరు: గ్రామీణ ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల్లో గెలిచిన స్థానిక ప్రజా ప్రతినిధులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అన్యాయం జరిగింది. తమ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్న వారి ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఎన్నికై మూడేళ్లు కావస్తున్నా నిధులు....విధులూ లేకపోవడంతో ఆ పార్టీలోని ప్రజాప్రతినిధిలే తీవ్ర నిరాశకు గురయ్యారు. కనీసం ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవమైనా దక్కుతుందనుకుంటే అదీ లేకుండాపోయింది. దీంతో విజయం సాధించామన్న సంతోషం కంటే.. ప్రజలకు ఏమీచేయలేకపోతున్నామనే బాధే వారిలో ఎక్కువగా కనపడుతోంది. 2021 ఫిబ్రవరి 21న పంచాయతీలకు, అదే ఏడాది ఏప్రిల్ 8న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో చిలమత్తూరు మండలంలోని 12 పంచాయతీలకు 11 పంచాయతీలు, 15 ఎంపీటీసీ స్థానాలకు 15 ఎంపీటీసీ స్థానాలను అధికార పార్టీ దక్కించుకుంది.

నిధులు లేవు.. విధులూ లేవు

గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలిచి మూడేళ్లవుతున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయారు. నిధులు లేవు... విధులు లేవు. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు పని లేకుండా పోయింది. ప్రతీది వారి ద్వారా జరుగుతుండటంతో పంచాయతీ కార్యాలయాల్లో దిష్టిబొమ్మలా కూర్చోవడం తప్పా చేసేదేమి లేదని పలువురు పేర్కొంటున్నారు. ఎంపీటీసీల పరిస్థితి మరీ ఘోరంగా మారింది. వారికి విధులు లేవూ...నిధులూ లేవు. కనీసం పంచాయతీ కార్యాలయంలో కూర్చుందామంటే వారికి ప్రత్యేకమైన కుర్చీ కూడా లేదు. మండల పరిషత్ సమావేశాల్లో ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లినా వాటిని పరిష్కరించిన దాఖలాలు లేవు. నిధుల జాడ లేక ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు.

నిధుల కోసం వినతులు

ఏదో రకంగా హామీలను నిలబెట్టుకొని ప్రజల్లో గౌరవం పొందాలనుకున్న ఎంపీటీసీలకు వైసీపీ ప్రభుత్వంలో అడుగడుగునా నిరాశే ఎదురవుతోంది. గ్రామాల్లో వారికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని వినతులు ఇస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. కనీసం సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేద్దామన్నా నిధుల లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో మండల పరిషత్‌కు పెద్దగా నిధులు మంజూరు కాకపోవడం, సాధారణ నిధులు కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో వారు ఏ పని చేయలేకపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎంపీటీసీలకు కొంత వరకు నిధులు కేటాయించడంతో కొన్ని పనులు చేశారు. వైసీపీ హయాంలో ఎంపీటీసీలకు ఒక్కపైసా విదల్చకపోవడంతో ఆవేదనకు గురవుతున్నారు.



పదవి ఉన్నా.. లేనట్లే..

మండల పరిషత్‌కు గతంలో బీఆర్‌జీఎఫ్ తలసరి గ్రాంట్, జనరల్ ఫండ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, 14వ ఆర్థిక సంఘం నిధులు సమకూరేవి. దీంతో గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేవారు. ప్రస్తుతం నిధులు ఎంపీటీసీల ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకు ఇస్తుండటంతో వారికి కనీస గౌరవం కూడా లేకుండా పోయింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 20 శాతం ఎంపీటీసీలకు ఇవ్వాల్సిందిగా కేంద్రం సూచించినా రాష్ట్రం ఇవ్వడం లేదు. ఎంపీటీసీలకు నిధుల వాటా 25 శాతం పెంచాలన్న విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ప్రత్యేక నిధులు కేటాయిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ విడుదల చేయడం లేదు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో సర్పంచులు, ఎంపీటీసీలు పదవి ఉన్నా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

మౌనమే మేలు..!



ఇటీవల ముగ్గురు టీచర్లపై సస్పెన్షన్ వేటు

ఈసీ చర్యలతో సంఘాల నేతల వెనకడుగు

అనంతపురం విద్య: ఎన్నికల వేళ... మెజార్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గొంతు విప్పేందుకు జంకుతున్నారు. గతంలో చిన్న సమస్య అయినా పదే పదే స్పందించే నాయకులు ఇప్పుడు ఏమి మాట్లాడాలన్నా ఆలోస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రభుత్వానికి వ్యతిరేకంగా, అనుకూలంగా మాట్లాడాలన్నా ఉపాధ్యాయ సంఘాల నాయకులు భయపడుతున్నారు. ఇటీవల ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు హరికృష్ణ, విజయ్‌భాస్కర్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై గళం విప్పారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఎలాంటి విచారణ లేకుండానే జిల్లా విద్యాశాఖాధికారులు ఆ ఇద్దరు సంఘాల నాయకులను గత నెల 20న సస్పెండ్ చేశారు. ఈ అంశం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తర్వాత వైఎస్‌ఆర్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేశారంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఈసీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఇటీవల అశోక్‌కుమార్‌రెడ్డిని జిల్లా విద్యాశాఖాధికారులు సస్పెండ్ చేశారు. ఈ రెండు సంఘటనలతో ఉపాధ్యాయులు, సంఘాల నాయకుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఏమాత్రం పెదవి విప్పినా మనకే చేటు అంటూ గుసగుసలాడుతున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడినా.. ప్రభుత్వానికి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినా ఈసీకి ఫిర్యాదులు వెళ్లిన వెంటనే... జిల్లా విద్యాశాఖాధికారులు వేటు వేస్తున్నారని, మనకెందుకు మౌనంగా ఉండటమే మేలు అన్న ధోరణిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.



మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారులు (ఫైల్)

నాడు ఉద్యానం.. నేడు అధ్వానం

వైసీపీ పాలనలో ఉద్యాన పంటలకు అందని ప్రోత్సాహం

రైతులకు అందని బిందు, తుంపర సేద్యపరికరాలు

ఉద్యాన పంటలకు అధిక ప్రోత్సాహమిచ్చిన టీడీపీ ప్రభుత్వం

పుట్టపర్తి రూరల్: వైసీపీ పాలనలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం ఊసే లేకుండాపోయింది. జిల్లాలో 66 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. టీడీపీ హయాంలో ప్రతి ఏడాది రూ. వందల కోట్లలో పోత్సహకాలు రైతులకు అందేవి. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రైతులకు నయాపైసా అందలేదు. జిల్లాలో రూ.8.85 కోట్ల ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రోత్సాహకాల వివరాలను అధికారులంతా అన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు కానీ ప్రభుత్వం రైతులకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. ఉద్యాన పంటలు సాగు చేసుకునే రైతులకు టీడీపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రోత్సాహకాలు అందించేది. ప్రస్తు ప్రభుత్వం అలాంటి వాటిని పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన పంటను బట్టి ప్రోత్సాహకాలు అందిస్తారు.

- కొత్తగా మామిడి సాగుచేసుకునే రైతుకు ఒక హెక్టారుకు ఏడాదికి రూ 13300 చొప్పున మూడేళ్ల పాటు అందించేవారు
- హెక్టారులో సాగు చేసిన జామకు ఏడాదికి రూ.29వేలు, దానిమ్మకు రూ.27వేలు మూడేళ్ల పాటు చెల్లించేవారు
- అరటికి హెక్టారుకు రూ.43వేలు, బొప్పాయికి రూ.23 వేలు పంపిణీ చేసేవారు
- బంతి, చామంతి, రోజా, వంటి పూలతోటలసాగుకు హెక్టారుకు రూ. 16 వేలు ఒకసారి అందించేవారు.
- మల్చింగ్ విధానంలో ఏపంట సాగు చేసినా హెక్టారుకు రూ.16వేలు అందించేవారు. ప్రస్తుతం మల్చింగ్ విధానం అమలు కావడంలేదు
- టమోటా సాగులో కర్రలు, ఊతం ఇచ్చేందుకు హెక్టారుకు రూ.18750 ఒకసారి ఇచ్చేవారు. ప్రస్తుతం లేదు
- మూడు మీటర్ల లోతు, 20 మీటర్ల పొడవు, వెడల్పుతో రైతులు ఫారంపాండ్స్ తవ్వుకుంటే రూ.75వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ ఊసే లేదు.
- ఉద్యాన ఉత్పత్తుల కేంద్రాన్ని ప్యాక్‌హౌస్ 20ఇంటూ 30 ప్రకారం నిర్మించుకుంటే, రూ. నాలుగు లక్షల యూనిట్ కాస్ట్ ఉంటే రూ.రెండు లక్షల ప్రోత్సాహకాన్ని అందించేవారు.

కానరాని బిందుసేద్యం

బిందు, తుంపర్ల సేద్యాలకు చంద్రబాబు హయాంలో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటిని పట్టించుకోవడం మానేశారు. తుంపర్ల సేద్యం యంత్రాలకు సంబంధించిన బకాయిలు వివిధ కంపెనీల కు చెల్లించకపోవడంతో పథకం ఆగిపోయింది. గడచిన మూడేళ్లలో ఈ పథకాలకు వైసీపీ ప్రభుత్వం నిధులు ఏమాత్రం మంజూరు చేయలేదు.



మామిడితోట

భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాలి

● ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర

ఓబుళదేవరచెరువు, మే 6: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలని ఉమ్మడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ వెంకటాపురం, బోగానిపల్లి, వీర ఓబునపల్లి, నారప్పగారిపల్లి, తుమ్మలకుంట్లపల్లి గ్రామాల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులకు హంద్రీనీవా నీరు నింపే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల గురించి తెలిపి చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. తొలుత నారప్పగారిపల్లి మూల్లూరమ్మ ఆలయం, తుమ్మకుంట్లపల్లిలో దండుమారెమ్మ ఆలయంలో సింధూర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, సర్పంచ్‌లు రెడ్డిపల్లి శంకర్‌రెడ్డి, శ్రీదేవి, ఎంపీటీసీ శ్రీనివాసులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక:

మండలంలోని తుమ్మలకుంట్లపల్లిలో పలుకుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. వీరికి పల్లె సింధూర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో వెంకటాపురం మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, అతని తనయుడు మోహన్‌రెడ్డితో పాటు 10కుటుంబాల వారు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వీరికి పల్లె కండువాలు వేసి ఆహ్వానించారు.

పల్లె కిశోర్ ప్రచారం..

నల్లమాడ: మండల కేంద్రంలో టీడీపీ యువనాయకుడు పల్లె వెంకట కృష్ణ కిశోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం లభించింది. తొలుత స్థానిక సత్యమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ షైలే శివశంకర్, కూటమి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బుక్కపట్నంలో రోడ్డుషో..

బుక్కపట్నం: మండలకేంద్రంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్డుషో నిర్వహించారు. స్థానిక ప్రజలు, నాయకులు గజమాలలు, డప్పులు, హారతులతో ఘన స్వాగతం పలికారు. పల్లె మాట్లాడుతూ రాష్ట్రప్రజల భవిష్యత్తు కోసం కూటమి అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని భారీ మెజార్టీతో గెలిపించాని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


తుమ్మలకుంటపల్లిలో టీడీపీలో చేరినవారితో పల్లె సింధూర


నల్లమాడలో సత్యమ్మకు పూజలు చేస్తున్న పల్లె కిశోర్ రెడ్డి

శాంతిభద్రతలను అనుక్షణం పర్యవేక్షించాలి


సమీక్షలో పాల్గొన్న ప్రత్యేక పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా

● ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి
● సమీక్షలో ప్రత్యేక పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా

పుట్టపర్తిరూరల్, మే 6: జిల్లాలో అనుక్షణం శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలంటూ ప్రత్యేక పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా సూచించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల పరిశీలకులు, ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులతో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా భావితరాలకు మంచి సమాజాన్ని అందించినట్లవుతుందన్నారు. పోలింగ్‌కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టించే రౌడీషీటర్లు అల్లరిమూకల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎక్కడా కూడా డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 16,56,775 మంది ఓటర్లు ఉన్నారని, వారు ఓటు వేసేందుకు వీలుగా 1852 పోలింగ్ కేంద్రాల్లో అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం లేపాక్షి మండలంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు చేశామన్నారు. మడకశిర, హిందూపురం, పెనుకొండ, కదిరి నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ కోసం హిందూపురం బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. 356 సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కర్ణాటక సరిహద్దుప్రాంతంలో చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి ముమ్మర తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఆర్వో కొండయ్య, సాధారణ ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, దీపక్ రామచంద్ర తివారి, రిదమ్ బరద్వాజా, వినాయక్, అమిత్‌కుమార్, పోలీసు అబ్జర్వర్ ఇమ్నాలెన్సా, అడిషనల్ ఎస్పీ విష్ణు, ఎక్సైజ్ అధికారి ఈఎస్ సహదేవుడు, డీఎస్పీలు పాల్గొన్నారు.

9లోగా ప్రవేశాలు నిర్ధారించుకోండి

● అంబేడ్కర్ గురుకుల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 6: అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలను నిర్ధారించుకోవాలని అంబేడ్కర్ గురుకుల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఇదివరకు మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థుల మార్కుల ఆధారంగా రాష్ట్ర అధికారులు ఎంపిక చేశారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో 720 సీట్లకు 720 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 400 సీట్లకు 400 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. దరఖాస్తు సమయంలో ఎంపిక చేసుకున్న ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లను సందర్శించి సంబంధిత పత్రాలతో ఈనెల 9లోగా ప్రవేశాలను నిర్ధారణ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎన్నికల విధులు సజావుగా నిర్వహించాలి

ధర్మవరం, మే 6: ఎన్నికల విధులు సజావుగా నిర్వహించేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి సూచించారు. పట్టణంలోని షిర్డీసాయిబాబా కల్యాణ మండపంలో సోమవారం ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలోని పీఓ, ఏపీఓలకు ఎన్నికల విధుల్లో చేపట్టాల్సిన పద్ధతులపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వోమాట్లాడుతూ.. ఎన్నికల విధులలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వరాదన్నారు. సజావుగా, విజయవంతంగా ఎన్నికలు నిర్వహించేలా విధులు బాధ్యతతో చేయాలన్నారు. ఓటరుకు ఓటు వేయడంలో అనుమానాలు వస్తే నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు కార్డు కలిగి ఉన్న ప్రతిఓటరు తప్పక ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, తహసీల్దార్ రమేశ్, సహాయ ఎన్నికల ఉపతహసీల్దార్ షణ్ముక పాల్గొన్నారు.

317 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

పుట్టపర్తి మే 6: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు రెండోరోజు సోమవారం 317 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్వీజే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పీఓలకు, ఏపీఓలకు ఎన్నికల విధులపై శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం వారు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల శిక్షణా తరగతులు పుట్టపర్తి నియోజకవర్గం ఆర్‌ఓ భాగ్యరేఖ ఆధ్వర్యంలో జరిగాయి.

804 మంది..

కదిరి, మే 6: కదిరి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో 4, 6 వ తేదీల్లో కలిపి వివిధ నియోజకవర్గాలు, ఇతర జిల్లాలు కలిపి 804మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును ఉపయోగించుకున్నట్లు ఏఆర్‌ఓ ముకుంద సోమవారం తెలిపారు. 4వ తేదీన 335మంది, 6న 469మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు చెప్పారు. కదిరి నియోజకవర్గానికి సంబంధించి 101మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.

ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

ధర్మవరం, మే 6: పట్టణంలోని బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాలలో ఫెసిలిటేషన్‌ను ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి సోమవారం తెలిపారు. 7, 8వ తేదీల్లో రెండు రోజులపాటు ఫెసిలిటేషన్ ఏర్పాటు చేశామని, ఓపీఓలతో పాటు ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులందరూ కూడా పోస్టల్‌బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈనెల 4వతేదీన సాయికృప జూనియర్‌కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్‌లో 277మంది పోస్టల్‌బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. అదేవిధంగా సోమవారం 355 మంది ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ఓటు హక్కును ఉపయోగించుకున్నారని ఆర్వో తెలిపారు.

ప్రశాంతంగా హోం ఓటింగ్

కొత్తచెరువు, మే 6: రాష్ట్ర ఎన్నికల సంఘం వికలాంగులకు, 85ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా 43 మంది హోం ఓటింగ్ దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎన్నికల అధికారులు హోం ఓటింగ్ చేసుకున్న వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు హక్కువినియోగించుకునే సౌకర్యాన్ని సోమవారం కల్పించారు. మండల వ్యాప్తంగా 16 మంది వికలాంగులు, 27మంది వృద్ధులకు ఇంటివద్దనే ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రశాంతంగా హోం ఓటింగ్ పూర్తి చేశామని తహసీల్దార్ కళావతి తెలిపారు.

దివ్యాంగులను గుర్తించని బీఎల్వోలు


దివ్యాంగురాలు ఫ్యారీమా

గాండ్లపెంట, మే 6: ఎన్నికల్లో పోలింగ్ కేంద్రం వద్దకు రాలేని దివ్యాంగులకు ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ వారి ఇంటివద్దకే పంపించి ఓటు వేయించాలని ఎన్నికల కమిషన్ తెలిపింది. అయితే మండల వ్యాప్తంగా 85ఏళ్ల వయసు పైబడిన వారు, మరియు దివ్యాంగులు చాలా మంది ఉన్నారు. అయితే అందులో కేవలం 21మందిని మాత్రమే గుర్తించడం బీఎల్వోల పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. మండలంలోని కటారుపల్లి పంచాయతీ బలిజపల్లికి చెందిన దివ్యాంగురాలు ప్యారీమాకు కళ్లు కనిపించవు, కాళ్లు, చేతులు కూ డా పనిచేయడం లేదు. ఆమె ఓటును ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేయించుకోవాల్సి ఉంది. అయితే బీఎల్వోలు ఆమెను గుర్తించలేదు. సోమవారం ఆంధ్రజ్యోతి ఆమెను పలకరించగా తనకు ఎలాంటి పోస్టల్‌బ్యాలెట్ అందలేదన్నారు. తనకు ఎవరూ తోడులేరని, తాను పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి ఎలా ఓటు హక్కును వినియోగించుకోవాలో అర్థం కాలేదని వాపోయారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా: కందికుంట


గోరంట్లవారిపల్లిలో ప్రచారం చేస్తున్న కందికుంట


బూరుగుపల్లిలో టీడీపీలో చేరినవారితో కందికుంట


టీడీపీలోకి చేరిన ముండ్లవారిపల్లి వాసులతో కందికుంట

కదిరిఅర్బన్, మే 6: ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ హామీ ఇచ్చారు. మండలంలోని బూరుగుపల్లి పంచాయతీలో గల బురుగుపల్లి, అబ్బావాండ్లపల్లి, ఎగువపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారుతులు పట్టారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి రాగానే చేపట్టే అభివృద్ధి పనుల గురించి వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని తెలిపారు. చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తారన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. పత్ర కులస్తులకు యేడాది లోపు కమ్యూనిటీ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చక్రవర్ధన్‌రెడ్డి, గంగులప్ప, రెడ్డెప్ప, చంద్ర, ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు:

బూరుగుపల్లి పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. ఎన్నికలప్రచారంలో ఉన్న కందికుంట వెంకటప్రసాద్‌ను వారు కలిసి పార్టీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి ఆహ్వానించారు. చేరినవారిలో సర్పంచ్ భాస్కర్, చిన్న ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, నారాయణ, గంగులప్ప, వెంకటప్ప, మల్లి, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

తనకల్లు: మండలంలోని ముండ్లవారిపల్లి గ్రామానికి చెందిన 20కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని కందికుంట నివాసంలో సోమవారం వారు ఆయన్ను కలిసి పార్టీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి ఆహ్వానించారు. చేరిన వారిలో మణికంఠ, వెంకటనారాయణ, హరి, చలపతి, ప్రకాష్, మణికంఠ, గంగాధర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపుదాం..

నల్లచెరువు: ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపుదామని కందికుంట వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని గోరంట్లవారిపల్లి, గోర్లవాండ్లపల్లి, నడింపల్లి, సుబ్బరాయునిపల్లి, ఉబిచెర్ల, మద్దిమడుగు గ్రామాల్లో కందికుంట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఆ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళల అభ్యున్నతికి ఆ పథకాలు మేలు చేస్తాయన్నారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. ఎన్నికల్లో సైకో సీఎంను ఇంటికి పంపాలని సూచించారు. టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు మాబూసాబ్, అబ్దుల్‌ఖాదర్, నాగభూషణనాయుడు, అశ్వర్థనాయుడు, ఆంజనప్ప, రఘునాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌నాయుడు, నరసారెడ్డి, బయ్యారెడ్డి, షాకీర్, వెంకటరమణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

భూ బకాసురుల ఆట కట్టిస్తా: సత్య కుమార్


ముచ్చురామిలో సత్యకుమార్, చిలకం మధుకు గజమాల వేస్తున్న కూటమి శ్రేణులు

ధర్మవరం రూరల్, మే6: కూటమి అధికారంలోకి రాగానే ధర్మవరం నియోజకవర్గంలో వైసీపీ చేసిన భూకుంభకోణాలపై నిగ్గు తేలుస్తామని, భూ బకాసురుల ఆట కట్టిస్తామని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని నిమ్మలకుంట, సీసీకొత్తకోట, పోతులనాగేపల్లి, కనంపల్లి, తుంపర్తి, మోటుమర్ల, కత్తేకొట్టాల, రేగాటిపల్లి, ముచ్చురామి, సీతారంపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, నాయకులు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారుతులు పట్టారు. తర్వాత వారు ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేకు కమలం గుర్తుకు ఓటేయాలని, ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పేదలకు ఇంటిస్థలాల పేరిట రైతుల నుంచి భూమిని కేవలం ఎకరా రూ. 5 లక్షలకు కొనుగోలు చేసి సెంటు రూ.5లక్షల నుంచి రూ. 10లక్షల వరకు అమ్ముకుని కోట్లాది రుపాయలు వెనకేసుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పద్ధతిలో భూకుంభకోణాలు జరిగాయన్నారు. ధర్మవరం చెరువు సమీపంలో ఎస్సీ రైతుల నుంచి బలవంతంగా భూములు రాయించుకుని గుర్రాల కోటను ఏర్పాటుచేసుకున్నారని దుయ్యబట్టారు. పేద ప్రజల పొట్ట కొట్టిన ఈ అవినీతి ఎమ్మెల్యేను వదిలేపెట్టే ప్రసక్తే లేదన్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే భూ బకాసురుల ఆట కట్టిస్తామన్నారు. అవినీతి వైసీపీని పారద్రోలుదామని, కూటమిని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీలు మద్దిలేటి, వేణుగోపాల్‌రెడ్డి, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్. నరేంద్రచౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ బీజేపీలోకి చేరిక

మండలంలోని సీసీకొత్తకోట వైసీపీ సర్పంచ్ పల్లె విష్ణువర్ధన్‌రెడ్డి బీజేపీలోకి చేరారు. గ్రామంలో ప్రచారంలో ఉన్న సత్యకుమార్‌ను ఆయన కలిసి పార్టీలోకి చేరారు. సత్యకుమార్ కండువా వేసి ఆహ్వానించారు.

సత్యకుమార్ కుటుంబసభ్యుల ప్రచారం


బత్తలపల్లిలో ప్రచారం కుటుంబీకుల ప్రచారం

సత్యకుమార్‌యాదవ్ సతీమణి త్రివేణి, కుమార్తె సంస్కృతి బత్తలపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కమలం గుర్తుకు ఓటేసి సత్య కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

ముదిగుబ్బ,మే6: మండల కేంద్రంలోని రైల్వే గేట్ కొట్టాలతో పాటు 1, 2, 6, 7, 8, 9, 10వ వార్డులలో టీడీపీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే వెంటనే వాటిని అమలు చేస్తారని చెప్పారు. ఆ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో టీడీపీ కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పథకాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సింగల్‌విండో మాజీ ప్రెసిడెంట్ వెంకటరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

రేపు కందికుంట రోడ్‌షో

తనకల్లు, మే 6: మండలకేంద్రంతో పాటు కొక్కంటిక్రాస్‌లో ఈనెల 8వతేదీ బుధవారం కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ రోడ్ షో ఉందని, టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొక్కంటి క్రాస్‌లో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం సీనియర్ నాయకులు దేశాయి విధురశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో కన్వీనర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా తనకల్లు, కొక్కంటి క్రాస్‌లో కందికుంట రోడ్‌షో చేపట్టనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. సమావేశంలో నాయకులు శంకర్‌నాయుడు, శ్రీరాములనాయక్, మల్లికార్జున, రవి, మహబూబ్‌బాషా, కిషోర్, శ్రీధర్‌రెడ్డి, హరినాయక్, బ్రహ్మానంద రెడ్డి మాజీ జడ్పీటీసీ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఏదీ?

తాడిమర్రి, మే 6: ఎన్నికల సరళి ప్రారంభమై నెల రోజులు దాటింది. మరో వారం రోజుల్లో ఎన్నికలు కూడా పూర్తి అవనున్నాయి. అయినా మండలంలో ఇంతవరకు ఎక్కడ కూడా ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించలేదు. దీనికి సంబంధించి ఎన్నికల కమిషన్ ముందుగానే ఆదేశాలు ఇచ్చినా.. ఇక్కడి అధికారులు ఎవరూ స్పందించలేదు. అధికార పక్షం కానీ, ప్రతిపక్షం కానీ ఎవరూ ఈవీఎంల అవగాహన గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏపీ ఐసెట్‌కు 44,446 మంది హాజరు

● త్వరలోనే ప్రిలిమినరీ ఆన్సర్ కీ

అనంతపురం సెంట్రల్, మే 6: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకోసం నిర్వహించిన ఏపీ ఐసెట్-2024 ఆన్‌లైన్ పరీక్షలకు 44,446 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏపీ, తెలంగాణలోని 113 కేంద్రాల్లో సోమవారం పరీక్షలు నిర్వహించారు. సెట్ నిర్వాహక కమిటీ చైర్మన్, అనంతపురం ఎస్కే యూనివర్సిటీ వీసీ హుస్సేన్‌రెడ్డి, కన్వీనర్ మురళీకృష్ణ పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షకు 48,828 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 44,446 మంది హాజరయ్యారని తెలిపారు. హాజరు 91 శాత నమోదైందని తెలిపారు. ప్రిలిమినీ ఆన్సర్ కీని త్వరలో విడుదలచేస్తామని తెలిపారు.

రేపు ఏపీ ఈసెట్

డిప్లమో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలను కల్పించేందుకు ఏపీ ఈసెట్-2024 పరీక్షలు బుధవారం జరగనున్నాయి. ఏపీ, తెలంగాణ పరిధిలో మొత్తం 37,767 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని సెట్ నిర్వాహక కమిటీ చైర్మన్, అనంతపురం జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి తెలిపారు. రెండు రాష్ట్రాల పరిధిలో మొత్తం 95 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.హైదరాబాదులో రెండు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఉదయం 9 తొలి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండో సెషన్ పరీక్షలు ప్రారంభమౌతాయని, గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన


సిద్ధం స్టిక్కర్లతో ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు

కొత్తచెరువు, మే 6: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికలలో పోటీ చేస్తున్న పార్టీలకు సంబంధించిన ఎలాంటి బ్యానర్లను, స్టిక్కర్లను బహిరంగప్రదేశాలలో, ఇళ్లకు అతికించరాదని నిబంధన ఉంది. అయితే వైసీపీ నాయకులు మాత్రం కొత్తచెరువు మండలంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి స్థానిక వలంటీర్లతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ సిద్ధం స్టిక్కర్లను ప్రతి ఇంటికి అతికిస్తున్నారు. మండల కేంద్రంలో ఎస్సీకాలనీ, ముస్లింకాలనీ, బసవన్నకట్ట వీధి, మండలంలోని నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి, వంగంపల్లి గ్రామాలలో ఆదివారం రాత్రి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, మాజీ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ సిద్ధం స్టిక్కర్లను ఇళ్లకు అతికిస్తూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. అదేవిధంగా ఇంటిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు ,వారి వివరాలు సేకరిస్తూ మీకు మేము అన్ని విధాలా ఆదుకుంటాం, ఈ నెల 13న జరిగే ఎన్నికలలో వైసీపీకి ఓటు వేయాలని వారిపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా ఎన్నికల అధికారులు, పోలీసులు ఏమీ పట్టనట్టుగా వ్యవహరించడం చూస్తుంటే వైసీపీకి పరోక్షంగా మద్దతు తెలుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చర్యలుతీసుకోవాలని ప్రజలు,ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.


ఇంటికి అతికించిన సిద్ధం స్టిక్కర్

వైసీపీ ప్రచారంలో వలంటీర్


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ వెంకటేష్

తనకల్లు, మే 6: ఎన్నికల కమిషన్ చెప్పినా, జిల్లా, మండల అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నా, ఇవి ఏమీ తమకు వర్తించవు అన్నవిధంగా కొంతమంది వలంటీర్లు వ్యవహరిస్తున్నారు. ఇందుకు మండలంలోని కొర్తికోట గ్రామంలో చోటు చేసుకున్న సంఘటనే నిదర్శనం. మండలంలోని కొర్తికోట గ్రామంలో సోమవారం వైసీపీ నాయకులు నిర్వహించిన ప్రచారంలో ఆగ్రామానికి చెందిన వలంటర్ వెంకటేష్ పాల్గొని యథేచ్ఛగా నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈవిషయం సోషల్ మీడియలో హల్‌చల్ అయింది. ఎన్నికలాధికారులు చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కోరుతున్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న నాయకులు

తనకల్లు, మే 6: మండలకేంద్రలో ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలనేదానిపై ఓటర్లకు అవగాహన కల్పించారు. టీడీపీ బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఓటింగ్ యాంత్రాల నమూనాలను తీసుకెళ్లి ఓటర్లకు ఓటింగ్‌పై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహబూబ్‌బాషా, శిరీషా, కుళ్లాయ్యప్ప, మల్లికార్జున, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

గార్లదిన్నె, మే 6: మండలంలోని కల్లూరు కొండకింద మారుతి నగర్‌కు చెందిన మురగన్ అనిల్‌కుమార్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. అతను అదే నగర్‌కు చెందిన ఏడేళ్ల చిన్నారిపై ఆదివారం లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి గట్టిగా కేకలు వేయడంతో అతను పారిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

హింసాత్మక ఘటనలు జరగకుండా చూడాలి

● పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం


పోలీసు హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు

పుట్టపర్తిరూరల్, మే 6: ఎన్నికల నియమావళిపై పోలీసులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల్లో హింసాత్మక సంఘటనలు ఎక్కడా చోటు చేసుకోకుండా చూడాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లాపోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్లో సోమవారం ఆయన అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలతో కలిసి హ్యాండ్‌బుక్ ను విడుదల చేశారు. ఎన్నికల సమయంలో పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ హ్యాండ్‌బుక్‌లో పొందుపరచారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక చర్యల ద్వారా ఎన్నికల నిర్వహణకు వివాదం కల్గించాలనుకునే అసాంఘిక శక్తుల ఆగడాలను చాకచక్యంగా తిప్పికొట్టాలన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసుల పాత్ర కీలకమైందన్నారు. ఈ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సమష్టిగా పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికలు దేశభవిష్యత్తుకు ఎంతో కీలకమైనవన్నారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ రోజున పోలీసుల విధులు, బందోబస్తు విధులు తదితర ఎన్నికల నియమావళి ఈ హ్యాండ్‌బుక్ ద్వారా పోలీసులకు తెలియజేశారు. ప్రతిఒక్కరూ ఈ నిబంధనలను తప్పకుండా అమలు పరిచి ఎన్నికలు నిష్పాక్షపాతంగా జరిగే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలత, కంజక్షన్, శ్రీనివాసులు, బాజీజాన్, శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎలక్షన్ సెల్ సీఐ విక్రమ్, ఎస్పీ ఎస్పై ప్రదీప్‌కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ,మే 6: మండలంలోని నాగారెడ్డిపల్లి బ్రిడ్జిపై సోమవారం రెండు కార్లు ఎదురెదురుగా వేగంగా వచ్చి పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరికిగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తనకల్లు మండలం కొక్కంటిక్రాస్‌కు చెందిన వినోద్ నాయక్, మల్లేశ్వరి అనంతపురం నుంచి కారులో స్వగ్రామానికి వస్తున్నారు. అయితే మండలంలోని నాగారెడ్డిపల్లి బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా మరో కారు వేగంగా వచ్చింది. ఈ క్రమంలో అదుపు చేయలేక రెండు కార్లు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో వినోద్ నాయక్, మల్లేశ్వరికి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు సమాచారం అందించడంతో 108 సిబ్బంది వచ్చి క్షతగాత్రులను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జగన్ పాలన అవినీతిమయం


విలేకరులతో మాట్లాడుతున్న ఎన్ తులసిరెడ్డి

పుట్టపర్తి, మే 6: రాష్ట్రంలో జగన్ పాలనంతా అవినీతిమయంగానే సాగిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ ఎన్ తులసిరెడ్డి విమర్శించారు. పట్టణంలోని సీమ్‌ట్రీ రెస్టారెంట్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ రాష్ట్ర అభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. అవినీతి పాలనే సాగించారన్నారు. ఇక ఆయన్ను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. తెలంగాణలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇక్కడ కూడా ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో సైతం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అరాకచ పాలన సాగించారని కాంగ్రెస్ అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ముదిగుబ్బ, మే6: ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలిస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యంను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. అలాగే మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నట్లు అప్‌గ్రేడ్ సీఐ యతీంద్ర తెలిపారు. వాటి మొత్తం విలువ రూ.15,750 ఉంటుందన్నారు. మద్యం అక్రంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామని, అందులో నవీన్‌నాయక్ వద్ద నుంచి రూ.8,250 విలువ చేసే మద్యం, జావిద్ వద్ద నుండి రూ. 7,500 విలువజేసే ఆంధ్రప్రదేశ్ మద్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు.


పట్టుబడిన మద్యం, నిందితులను చూపుతున్న పోలీసులు

ఏపీ ఐసెట్‌కు 44,446 మంది హాజరు

త్వరలోనే ప్రిలిమినరీ కీ

అనంతపురం సెంట్రల్, మే 6: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకోసం నిర్వహించిన ఏపీ ఐసెట్-2024 ఆన్‌లైన్ పరీక్షలకు 44,446 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏపీ, తెలంగాణలోని 113 కేంద్రాల్లో సోమవారం పరీక్షలు నిర్వహించారు. సెట్ నిర్వాహక కమిటీ ఛైర్మన్, అనంతపురం ఎస్కేయూ యూనివర్సిటీ వీసీ హుస్సేన్‌రెడ్డి, కన్వీనర్ మురళీకృష్ణ పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షకు 48,828 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 44,446 మంది హాజరయ్యారని తెలిపారు. హాజరు 91 శాతం నమోదైందని తెలిపారు. ప్రిలిమినీ ఆన్సర్ కీని త్వరలో విడుదలచేస్తామని తెలిపారు.

రేపు ఏపీ ఈసెట్

డిప్లమో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలను కల్పించేందుకు ఏపీ ఈసెట్-2024 పరీక్షలు బుధవారం జరగనున్నాయి. ఏపీ, తెలంగాణ పరిధిలో మొత్తం 37,767 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని సెట్ నిర్వాహక కమిటీ ఛైర్మన్, అనంతపురం జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి తెలిపారు. రెండు రాష్ట్రాల పరిధిలో మొత్తం 95 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. హైదరాబాదులో రెండు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఉదయం 9 తొలి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండో సెషన్ పరీక్షలు ప్రారంభమౌతాయని, గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

9లోగా ప్రవేశాలు నిర్ధారించుకోండి

అంబేడ్కర్ గురుకుల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 6: అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలను నిర్ధారించుకోవాలని అంబేడ్కర్ గురుకుల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఇదివరకు మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థుల మార్కుల ఆధారంగా రాష్ట్ర అధికారులు ఎంపిక చేశారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో 720 సీట్లకు 720 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 400 సీట్లకు 400 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. దరఖాస్తు సమయంలో ఎంపిక చేసుకున్న ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లను సందర్శించి సంబంధిత పత్రాలతో ఈనెల 9లోగా ప్రవేశాలను నిర్ధారణ చేసుకోవాలని పేర్కొన్నారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్న వృద్ధులు, దివ్యాంగులు



టీడీపల్లిలో ఇంట్లోనే ఓటు వేస్తున్న వృద్ధుడు తిమ్మప్ప

మడకశిర రూరల్, మే 6 : ఎన్నికల సంఘం తొలిసారిగా 85 ఏళ్ల వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. నియోజకవర్గంలో 306 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో 85ఏళ్ల పైబడిన వృద్ధులు 112 మంది, దివ్యాంగులు 194 మంది ఉన్నారు. నిబంధనల ప్రకారం అందుకు సోమవారం ఎన్నిక పోలింగ్ అధికారి ఒక బీఎల్‌ఓ, ఒక పోలీసు, వీడియో గ్రాఫర్‌ను టీంగా ఏర్పాటుచేశారు. ఆయా గ్రామాల్లోని వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల దగ్గరకు వెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంపార్టుమెంట్‌లో ఓటువేయించారు. వాటిని షీల్డు కవర్‌లలో ఉంచి బ్యాలెట్ బాక్సుల్లో వేయించారు.

గడ్డి పంపిణీ చేయాలి

నాగరాజు, రైతు, బంద్రేపల్లి



మడకశిర, మే 6 : టీడీపీ హయాంలో నియోజకవర్గం కేంద్రాలు, మండల కేంద్రాల్లో గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి, పాడి రైతులకు ఉచితంగా గడ్డిని పంపిణీ చేసేవారు. గత సంవత్సరం నుంచి తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నియోజకవర్గంలో తీవ్ర దుర్భిక్షం నెలకొంది. భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయాయి. వాటి కింద పంటలు సాగు చేయక పొలాలను బీళ్లుగా వదిలేశారు. పశువులకు మేత, నీరు కరువై తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇలాంటి దుర్భర పరిస్థితి ఎన్నడూ చూడలేదు. గడ్డి ధర ఆకాశాన్ని అంటుతోంది. ట్రాక్టర్ గడ్డి రూ. 15వేల దాకా ఉంది. అది కూడా దొరకడం కష్టమైంది. ప్రస్తుతం ప్రభుత్వం దాణా, గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తోంది. బోర్లలో నీరులేకపోతే గడ్డి ఎక్కడ సాగు చేయాలి. ఇక పశువులు నీరు తాగేందుకు ఏర్పాటు చేసిన తొట్టిలు నిరుపయోగంగా ఉన్నాయి. నియోజకవర్గంలో మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువులకు తాగేందకు నీరు సరఫరా చేయాలి. అలాగే పంచాయతీ కేంద్రాల్లో గీనీ , మండల కేంద్రాల్లో గానీ గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేయాలి. నాకు నాలుగు పాడి ఆవులు ఉన్నాయి. రోజుకు 25 కిలోల గడ్డి అవసరం. గ్రాసం లేకపోవడంతో పాల దిగుబడి బాగా తగ్గి పోయింది. అధికారులు వెంటనే స్పందించి గడ్డి పంపిణీ చేయాలి.

కబ్జాలు, దందాలకు చెక్‌పెడతా

● ఎన్నికల ప్రచారంలో నందమూరి బాలకృష్ణ



బాలకృష్ణకు హారతులు పడుతున్న మహిళలు

హిందూపురం, మే 6: వైసీపీ ఐదేళ్ల పాలనలో హిందూపురంలో భూదందాలు, కబ్జాలు, అక్రమాలు పెరిగిపోయాయని, వాటికి చెక్ పెట్టేది తానే అని టీడీపీ స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం పట్టణ పరిధిలోని కొల్లకుంట, కొట్నూరు, ఇందిరమ్మ కాలనీ, చౌడేశ్వరీ కాలనీ, ఆర్టీసీ కాలనీతో పాటు ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి, మేళాపురం ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. మూడోసారి తనను గెలిపిస్తున్నారని, అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపుతానన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ హిందూపురానికి, నందమూరి కుటుంబానికి అడ్డా అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడి ప్రజలు తమ పార్టీని ఆదరిస్తున్నారని, ఎన్టీఆర్ మూడుసార్లు గెలిచారన్నారు. నందమూరి హరికృష్ణ ఒకసారి, తాను మూడోసారి ఎమ్మెల్యే బరిలో ఉన్నానన్నారు. ఇప్పటి వరకు మమ్మల్ని ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో అద్భుతంగా ఉందని... పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుందన్నారు. అన్నివర్గాలవారికి అండగా నిలుస్తుందన్నారు. వైసీపీ అరాచకాలకు స్వస్తి పలకాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత : వసుంధరా దేవి

చిలమత్తూరు: మహిళా సాధికారత టీడీపీ తోనే సాధ్యమని నందమూరి వసుంధరా దేవి పేర్కొ న్నారు. ఆమె సోమవారం ఎంపీ అభ్యర్థి పార్థసారథి భార్య కమలమ్మతో కలిసి మండలంలోని కోడూరు తోపు వద్ద ఉన్న టెక్స్‌పోర్టు గార్మెంట్స్‌లోని మహిళా కార్మికులతో మాట్లాడారు. ఓటును అభ్యర్థించారు. మహిళలు అభివృద్ధి కేవలం టీడీపీతోనే సాధ్యమన్నారు. మహిళలను దృష్టిలో పెట్టుకొని టీడీపీ మేనిఫెస్టోలో పలు పథకాలు ప్రకటించారన్నారు. టీడీపీ హయాంలో మహిళలకు ఎంతో రక్షణ ఉండేదని, ఈ ప్రభుత్వంలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మి, తెలుగు మహిళలు పరిమళ, శ్రీదేవి, కోడూరు మాజీ సర్పంచ్ సోమశేఖర్ తదితరులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షి: నందరూరి వసుంధరాదేవి సోమవారం లేపాక్షి పంచాయతీ గొంగటిపల్లి, సోమిరెడ్డిపల్లి, గలిబిపల్లిల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హారతులతో స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను, ఎంపీ అభ్యర్థి బీకే పార్థ సారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.



మహిళా కార్మికులతో ఓటు అభ్యర్థిస్తున్న వసుంధరా దేవి

సైనికుల్లా విజయం దిశగా దూసుకెళ్లాలి

టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలకు సవిత పిలుపు



బీకే, సవిత, నిమ్మల ఎన్నికల ప్రచారం



మల్లాపల్లి వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నబీకే, సవిత

గోరంట్ల, మే 6: ఈ ఎన్నికల్లో ఏ శక్తి అడ్డు వచ్చినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు యుద్ధ సైనికుల్లాగా విజయం దిశగా దూసుకెళ్లాలని టీఈపీ కూటమి ఎమ్మెల్యే సవిత పిలుపునిచ్చారు. ఆమ సోమవారం కలిపి గోరంట్లలోని పుట్ట గుడ్లపల్లి, మల్లాపల్లి, నారసింహపల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. మల్లాపల్లిలో జరిగిన రోడ్ షోలో ఎంపీ అభ్యర్థి పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప పాల్గొన్నారు. వారికి మల్లాపల్లి ప్రజలు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీకే, నిమ్మల మాట్లాడుతూ... ఈ ఎన్నికలు ఆషామాషీవి కావని, అన్ని శక్తియుక్తులతో వీరసైనికుల్లా ఎన్నికల కదన రంగంలో పనిచేయాలన్నారు. విజయమే లక్ష్యంగా సాగాలని కోరారు. పాతకొత్త కలయిక అయినందున అందరినీ కలుపుకుని పోవాలన్నారు. వైసీపీపై పోరాటం చేయాలే తప్ప, మన వారిపై కాదని హితవు పలికారు. పోలింగ్ రోజున కూడా క్యాడర్‌కు అందుబాటులో ఉంటామని, ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. వైసీపీకి కాలం చెల్లిందని, ముందుగానే వారికి తెలసిపోయిందన్నారు. దుర్మార్గపు పాలనను సాగనంపడానికి అందరూ కార్యోన్ముఖులై ఎనిమిదిరోజుల పాటు అవిశ్రాంత పోరాటం చేయాలన్నారు. సవిత మాట్లాడుతూ అడ్రస్‌లేని వ్యక్తికి ఓటు వేస్తే మన అడ్రస్ గల్లంతవుతుందన్నారు. సైబీరియన్ పక్షులకు వేసవిలో వచ్చేందుకు అడ్రస్సు ఉందికానీ, మంత్రి ఉషశ్రీచరణ్‌కు మాత్రం లేదన్నారు. సంపాదన ఉన్నచోటే ఆమె చిరునామా అన్నారు. ఒకప్పుడు కర్ణాటక, నేడు ఆంధ్ర ఆమె చిరునామా అన్నారు. కల్యాణదుర్గంలో అనకొండలా దోచేసి, పెనుకొండకు తిమింగలంలా వచ్చింద న్నారు. రైతులు బాగుడాలన్నా, కియలాంటి పరిశ్రమలు రావాలన్నా, చెరువులకు నీరు చేరాలన్నా, తాగునీరు కావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. మన పిల్లల భవిష్యత్తు, మన భవిష్యత్తు కోసం సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను, బీకేని గెలిపించాలని పిలుపునిచ్చారు. పుట్టగుండ్లపల్లి, కొమ్ములతండా, మల్లాపల్లి ప్రాంతాలకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి సవిత కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్, నిమ్మల యువశేఖర్, నిమ్మల శిరీష్, దేవా నరసింహప్ప, వెంకటరెడ్డి, నరేష్‌కుమార్‌యాదవ్, మహమ్మద్, ఫిరోజ్ బాషా, శ్రీధర్, నారాయణస్వామి, గంగిరెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, రామాంజనేయరెడ్డి, మహబూబ్‌సాబ్, ఉమ్మర్‌ఖాన్ తదితరులు, కూటమి నాయకులున్నారు.



బూచేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సవిత

కూటమిదే విజయం: బీకే

గోరంట్ల: ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయ ఢంకా మోగిస్తుందని టీడీపీ కూటమి హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి హిందూపురం వరకు జరిగిన టీడీపీ సమావేశాలకు పెద్దఎత్తున జనం స్వాగతం పలుకడమే నిదర్శనమన్నారు. మండలంలోని మల్లాపల్లిలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని, నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కాబోతున్నారని కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా ధర్మవరంలో పేర్కొన్నారన్నారు. దుర్మార్గపు పాలన సాగిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో సాగనం పాలని ఆయన పిలుపునిచ్చిన విషయాన్ని బీకే గుర్తు చేశారు. భూ హక్కు చట్టం విషయంలో జగన్‌లో భయంమొదలైందన్నారు. రైతు పాస్ పుస్తకాలపై రాజముద్ర ఉండాలేకానీ, ముఖ్యమంత్రి ఫొటోకాదన్నారు. జగన్ ఫొటో ఎలా వేసుకుంటారని ప్రశ్నించారు. వైసీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ బళ్లారి వ్యక్తి అన్నారు. నలభై యేళ్లుగా రాజకీయాల్లో ఉన్న తనకే ఆమె తెలియదన్నారు. అలాంటి శాంతమ్మ ప్రత్యర్థి కావడంతో తనకు భారీ మెజార్టీ వస్తుందన్నారు. ఎంపీ గోరంట్ల మాధవ్‌కు ఏహోదా ఇవ్వకుండా మూలన కూర్చోపెట్టగా, ఎమ్మెల్యే శంకర్‌నారాయణను అనంతపురం పంపారన్నారు. మంత్రి ఉషశ్రీ బెంగుళూరు నుంచి కళ్యాణదుర్గం రాగా, అక్కడ చెత్తగా నిర్ణయించి పెనుకొండకు పంపారన్నారు. ఎక్కడికెళ్లినా చెత్త చెత్తేనని, బంగారం కాదన్నారు. పెనుకొండప్రజలు సైతం పనికి రాని చెత్తను ఏ చెరువులోనో, సముద్రంలోనో పడవేస్తారన్నారు. ప్రజలు చైతన్యవంతులై ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా సవితను గెలిపించాలని కోరారు

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఎంఎస్ రాజు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంఎస్ రాజు

గుడిబండ/రొళ్ల, మే 6 : చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పే స్వామి పేర్కొన్నారు. వారు సోమవారం మండలంలోని శంకరగల్లు, రాళ్లపల్లి, జమ్మలబండ, కరికెర, నాగేపల్లి, చిగతుర్పి, దేవరహట్టి, పంచాయతీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దన కుంటప్ప, లక్ష్మీనరసప్ప, దుర్గేష్, భీమరాజు, లక్ష్మీనారాయణ, నజీర్, రవిస్వామి, బోజరాజు, వెంకటేష్, శ్రీనాథ్, నాగేంద్రప్ప, శంకర్‌లు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి, రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వీఎం పాండురంగప్ప సోమవారం మండలంలోని అగ్రహారం, మలసముద్రం, ఎం రాయాపురం, కాకి పంచాయతీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కంకరేసి.. వదిలేశారు..

ఇబ్బందుల్లో ప్రజలు



రోడ్డుపై వెడల్పుగా పడిన కంకర

హిందూపురం అర్బన్, మే 6: అశాశ్వతమైన, కంటితుడుపు పనులు చేసి అధికారులు వదిలేశారు. దాని వల్ల ప్రతి రోజు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురు ప్రమాదాలకు గురతున్నారు. కిందపడి గాయాలతో ఆసుపత్రిలో చేరుతున్నారు. సీఎం జగన్ రెండు రోజుల కిందట హిందూపురంలో పర్యటించారు. ఆయన వస్తున్నాడని, ఆయన ప్రయాణించే రోడ్డుమార్గంలో గుంతలు ఎక్కడా లేకుండా చేయాలని తాత్కాలిక చర్యలు చేపట్టారు. పట్టణంలో ఎప్పుడూ రద్దీగా ఉండే రిలయన్స్ పెట్రోల్ బంక్ క్రాస్‌లో రోడ్డు పాడైపోయింది. అక్కడ ఐదేళ్ల నుంచి పెద్ద గుంత ఏర్పడింది. దానిని సంబంధిత అధికారులు ఏనాడూ పట్టించుకోలేదు. సీఎం వస్తున్నాడని, ఆ గుంత కనపడకుండా చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గుంత పెద్ద ఎత్తున కంకర వేసి, దానిపై రోడ్డు రోలర్ తిప్పి వదిలేశారు. పకడ్బందీ చర్యలు చేపట్టలేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గాన వాహనాలు దాని మీదే ప్రయాణించడంతో కంకర చెల్లా చెదురై పోయింది. దీంతో దానిపై వెళ్లే ద్విచక్రవాహనదారులు పలువురు జారి అదుపుతప్పి కిందపడుతున్నారు. దెబ్బలు తగిలి ఆసుపత్రికి వెళుతున్నారు. అయినా అధికారు లు పట్టించుకోవడం లేదు. ప్రాణాలు పోతే కానీ అధికారులు రోడ్డును సరి చేయరేమో అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా కంకర వేయకుండా అలాగే వదిలి వేసి ఉన్నా ప్రమాదాలు జరిగేవి కావని విమర్శిస్తున్నారు.

టీడీపీలో చేరిన ఎన్ఆర్ఐ

పెనుకొండ టౌన్, మే 6 : 2019లో జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు లండన్ నుంచి 25వేల కిలోమీటర్లు దాటి వచ్చి వైసీపీకి ఓటు వేసిన ఎన్ఆర్ఐ నేడు అదే వైసీపీని ఛీకొట్టిన సంఘటన శ్రీసత్యసాయిజిల్లా గోరంట్ల మండలం ఎం.కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత కొత్తపల్లి, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో నరసింహారెడ్డి, ఎన్ఆర్ఐ శ్రీఈర్‌రెడ్డి కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి సవిత కండువావేసి ఆహ్వానించారు.

సవిత ఆధ్వర్యంలో పార్టీలో చేరిన ఎన్ఆర్ఐ కుటుంబం నరసింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి →



రోడ్డుపై మురుగునీటి ప్రవాహం



రొద్దం వైఎస్ఆర్ సర్కిల్‌లో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

రొద్దం, మే 6 : మండలకేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో రోడ్డుపై మురుగునీరు యథేచ్ఛగా ప్రవహిస్తోంది. అయినా ప్రజాప్రతినిధులుకానీ, అధికారులుకానీ పట్టించుకున్న పాపానపోలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రొద్దం ప్రధాన వీధుల్లో సరైన డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో గ్రామ స్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధిలేక ఆ మురుగునీటిలోనే నడుస్తూ అసహ నం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై నిత్యం మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తున్నా అటుగా వెళ్లే ప్రజాప్రతి నిధులు, అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు డ్రైనేజీలోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి అంటే ఇదేనా?: టీడీపీ నాయకులు

రొద్దంమండలకేంద్రంలోని పాత ఎస్సీ కాలనీలో ఇళ్ల దగ్గర డ్రైనేజీని శుభ్రం చేయకపోవడంతో చెత్తా చెదారంతో నిండి పోయి కంపు కొడుతోంది. అయినా పట్టించుకున్న నాథులు కరువయ్యారని, అభివృద్ధి అంటే ఇదేనా అని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. టీ డీపీ నాయకులు మంగళవారం రొద్దం హరిజనవాడలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సమయంలో అడుగడుగునా డ్రైనేజీ సమస్యను వారు గమనించారు. మురుగుకాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీ వాసులంటే వైసీపీవారికి అంత అలుసుగా ఉందా అని ప్రశ్నించారు. ఏడాది నుంచి డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని పట్టించుకునే వారే లేరని మండిపడ్డారు. నాయకులు చిన్నప్పయ్య, నరసింహులు, హరీష్, వీరాంజనేయులు, వాల్మీకి చంద్రశేఖర్, సిద్దన్న, నాగేంద్ర, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



రొద్దం ఎస్సీ కాలనీలో చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీని చూపుతున్న టీడీపీ నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

చిలమత్తూరు, మే 6: ఎన్నికల దగ్గరపడుతున్న కొద్దీ టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి. అధికార పార్టీలో అసంతృప్తులు మొదలుకొని పాలన పట్ల విసుగుచెందిన పెద్ద ఎత్తున గ్రామాల్లో టీడీపీ కండువాలు కప్పుకుంటున్నట్లు పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాలు బాగుపడతాయన్న ఆలోచనతో స్వచ్ఛందంగా వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్నట్లు చెబుతున్నారు. మండలంలోని మొరసలపల్లికి చెందిన పలువురు సోమవారం వైసీపీ నాయకులు పలువురు టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, కన్వీనర్ రంగారెడ్డి పార్టీ కండు వాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేమకేతేపల్లి అంజి నప్ప, కోడూరు సోమశేఖర్, అశ్వత్థప్ప, నందీషప్ప తదితరులు ఉన్నారు.

నేడు, రేపు ఓపీఓలకు పోస్టల్ బ్యాలెట్

ఆర్ఓ అభిషేక్‌కుమార్



విధులకు హాజరైన పీఓలు

హిందూపురం అర్బన్, మే 6: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఓపీఓలకు మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునే అవకాశం కల్పించినట్లు ఆర్ఓ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. హిందూపురం పట్టణ పరిధిలోని కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటును వినియోగించుకోవచ్చని ఆర్ఓ తెలియజేశారు. ఆయన సోమవారం ఫెసిలిటేషన్ కేంద్రంలో ఎన్నికల విధులకు హాజరయ్యే పీఓలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆర్ఓ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఎంఈఓ గంగప్ప, మాస్టర్ ట్రైనర్లు ఇస్మాయిల్, సునీల్ గణేష్ తదితరులు ఉన్నారు.

ప్రజల ఎదుటే పోలీసుల బాహాబాహి

సోషల్ మీడియాలో వీడియో వైరల్



పట్టపగలే ప్రయాణికుల ఎదుట కొట్టుకుంటున్న పోలీసులు

రొళ్ల, మే 6 : మండల పరిధిలోని పిల్లిగుండ్ల చెక్‌పోస్ట్ వద్ద నడి రోడ్డుపై ఇద్దరు కానిస్టేబుళ్లు ఆదివారం ప్రయాణికులు, ప్రజలు చూస్తుండగానే బాహాబాహికి దిగి కొట్టుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎన్నికల సందర్భంగా రొళ్ల, అగళి పోలీస్ స్టేషన్లకు చెందిన నారాయణస్వామినాయక్, శివకుమార్‌ను పిల్లి గుండ్ల చెక్‌పోస్టు వద్ద నియమించారు. విధి నిర్వహణ విషయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసినట్లు సమాచారం. ఎవరైన గొడవ పడితే సర్దిచెప్పాల్సిన పోలీసులే ఇలా నడి రోడ్డుపై కొట్టుకుంటే ఇక శాంతి భద్రతలు ఎక్కడ ఉంటాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై రొళ్ల, అగళి ఎస్సైలు రాజశేఖర్, వీరేశ్‌ను వివరణ అడిగితే విచారణ చేసి ఇద్దరిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు టీడీపీ ఇంటింటి ప్రచారం


మడకశిరటౌన్ / అగళి, మే 6: అగళి మండల పరిధిలోని ఆరు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని అల్లికెర, ఇనగలూరు, మధుడి, కొమరేపల్లి, ఆలూడి, నరసాంబుది గ్రామ పంచాయతీకి కేంద్రాలలో ఎన్నికల ప్రచారం ఉంటుందని తెలిపారు. టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు అగళి మండల కన్వీనర్ కుమారస్వామి కూడా ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు ఆత్మీయ సమావేశం

మడకశిరటౌన్, మే 6: టీడీపీ ఆధ్వర్యంలో కుంచిటిగ వక్కలిగుల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్ తదితరులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని యాదవ కల్యాణ మం డపంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.ఎస్.రాజు, నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

జపానంద స్వామి ఆస్పత్రిని

సందర్శించిన కర్ణాటక డీజీపీ



ఆస్పత్రికి గొడుగులు అందజేస్తున్న డీజీపీ రవికాంత గౌడ

పావగడ, మే 6: తాలూకా కేంద్రంలోని వివేకానంద ఆరోగ్య సంస్థ శ్రీశారదాదేవి కంటి ఆస్పత్రి పరిశోధన కేంద్రాన్ని కర్ణాటక పోలీసు డైరెక్టర్ డాక్టర్ రవికాంత్‌గౌడ సోమవారం మధ్యాహ్నం సందర్శించారు. ఆస్పత్రిలోని సేవలు, చికిత్స వ్యవస్థలపై జపానంద స్వామితో ఆయన అడిగి తెలుసుకొన్నారు. ఎండ తీవ్రతకు భయపడుతున్న పావగడలో ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలనే అంశంపై ఆస్పత్రి సిబ్బందికి ఆయన వివరించారు. రెండు ఖాళీ కుర్చీలు, రెండు పెద్ద గొడుగులను ఆస్పత్రికి కానుకగా ఇచ్చి జపానంద ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్, హైకోర్టు లాయర్ హొన్నప్ప, డాక్టర్ వెంకటరావు ఎయ్య, ఆస్పత్రి సిబ్బంది హాజరున్నారు.